


సూర్య
దినపత్రిక
www.suryaa.com
19 వ వసంతంలోకి ...
గురువారం,11 డిశంబర్ 2025
కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
అల్లూరి సీతారామరాజు జిల్లా
8 పేజీలు


## రామచంద్రపురం వాసులకు 'బిగ్' రిలీఫ్..

# పండుగ లాంటి వార్త !



- రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌పై సందిగ్ధతకు తెర
- యథాతథంగానే రెవెన్యూ డివిజన్, డీఎస్పీల కార్యాలయాలు
- ప్రజలు ఆందోళన చెందవద్దు.. అండగా నేనున్నాను : మంత్రి వాసంశెట్టి సుభాష్
- అమరావతిలో సీఎం చంద్రబాబుతో మంత్రి కీలక భేటీ - ఫలించిన చర్చలు
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని సీఎం హామీ

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం చల్లని కబురు చెప్పింది.గతకొద్ది రోజులుగా రెవెన్యూ డివిజన్ మార్పుపై నెలకొన్న ఊహాగానాలకు, ఆందోళనలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో జరిగిన భేటీతో శాశ్వతంగా తెరపడింది.

**అమరావతిలో కీలక పరిణామం**

బుధవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈసందర్భంగా రామచంద్రపురం నియోజకవర్గంలోని తాజా పరిస్థితులను, ప్రజల మనోభావాలను మంత్రి.. సీఎం దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ డివిజన్,సబ్‌డివిజనల్ పోలీస్ ఆఫీస్ (డిఎస్పీ ఆఫీస్)మార్పుపైప్రజల్లోఉన్న అపోహలను వివరించారు.

**సీఎం చంద్రబాబు స్పష్టమైన హామీ**

మంత్రి విజ్ఞప్తిపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ మరియు డీఎస్పీ కార్యాలయం ఎట్టి పరిస్థితుల్లోనూ అక్కడే, యథాతథంగా కొనసాగుతాయని స్పష్టమైన హామీ ఇచ్చారు.పరిపాలన సౌలభ్యం కోసం ఉన్న ఆఫీసులను మార్చే ప్రసక్తే లేదని,ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సీఎం భరోసా కల్పించారు.

- తరువాయి 2లో..










# సత్యదేవుని సన్నిధిలో నూతన శకం








- నూతన ఈవోగా వేంద్ర త్రినాథ్ రావు బాధ్యతలు
- పాలనా ప్రక్షాళన దిశగా కొత్త ఈవో త్రినాథ్ రావు
- అన్నవరంలో 'వసూళ్ల' పర్వానికి చెక్!.. భక్తుల ఆశల పల్లకిలో కొత్త ఈవో
- పవిత్రత - పారదర్శకత.. అన్నవరం నూతన ఈవో ముందున్న సవాళ్లు - ఆశలు
- అన్నవరం దేవస్థానం ఈవోగా ఆర్జెడి వేంద్ర త్రినాధరావు బాధ్యతలు స్వీకరణ

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :** భక్తులు సత్యదేవుడిగా కొలిచే రత్నగిరి కొండపై వెలసిన శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానంలో పాలనా పరమైన మార్పులకు సమయం ఆసన్నమైంది. దేవస్థానం నూతన కార్యనిర్వహణాధికారిగా ఆర్.జె.డి.స్థాయి అధికారి వేంద్ర త్రినాథ్ రావు బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ బాధ్యతలు స్వీకరించారు. ఆయన రాకతో కొండపై అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని, పాలన గాడిన పడుతుందని భక్తులు, కొందరు ఉద్యోగులు గట్టిగా విశ్వసిస్తున్నారు. కొండపై నెలకొన్న కొన్ని సమస్యలను వివిధ ప్రాతిపదికన పరిష్కరించి స్వామివారి పవిత్రతను కాపాడాలని భక్తులు కొత్త ఇవ్వమును కోరుతున్నారు.

**భక్తుల ఆవేదన... అనవసరపు వసూళ్లు, దందాలపై ఉక్కుపాదం**

సత్యదేవుని దర్శనానికి వచ్చే సామాన్య భక్తుడు అడుగడుగునా దోపిడీకి గురవుతున్నాడన్న విమర్శలు బలంగా ఉన్నాయి.

**- వ్రతాల పేరిట దందా :** వ్రత మండపాల్లో పురోహితులు కొందరు దానధర్మాల పేరుతో, "ఫలితం దక్కాలంటే అదనంగా ఇవ్వాలి" అంటూ మైకుల్లో భక్తులను భయపెట్టి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారు.ఈతరహా ఒత్తిడిని తక్షణం నియంత్రించాలి.

**- ధరల పట్టిక ఏది?:** వ్రత సామాగ్రి (కిట్) మొదలుకొని, కొండపై అమ్మే తినుబండారాలు,

- తరువాయి 2లో..

## సమాజ హితం కోసం

# ప్రకృతి వ్యవసాయం

- ప్రకృతి రాగ వారి 'నేచురల్ బయో ఇన్‌పుట్ రిసోర్సెస్ సెంటర్' ప్రారంభం





**కాకినాడ,మేజర్‌న్యూస్ :** ఆరోగ్యకర ఆహార పదార్థాలను స్వీకరించడానికి, మానవాళికి ఎంతో మేలు చేసే ప్రకృతి వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రముఖ ప్రకృతి వ్యవసాయ ప్రచారకులు విజయరామ్ ఉద్ఘాటించారు. పద్మశ్రీ సుభాష్ పాలేకర్ కృషిని ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తున్న విజయరామ్, రసాయనిక ఎరువుల దుష్ప్రభావాల పట్ల రైతులను చైతన్యవంతులను చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పేర్కొన్నారు.

కాకినాడ జిల్లా రామేశ్వరంలోని హరిత రాగ క్షేత్రంలో కెప్టెన్ అజ్జరపు మల్లికార్జున్ రావు, రాజేశ్వరి దంపతుల పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ప్రకృతి రాగ వారి నేచురల్ బయో ఇన్‌పుట్ రిసోర్సెస్ సెంటరును విజయరామ్ బుధవారం ప్రారంభించారు. ఈ కేంద్రం సుమారు 49 గ్రామాల రైతులకు ప్రకృతి వ్యవసాయ విధానంతోపాటు, ఆరోగ్యకర ఉత్పత్తులకు అవసరమైన జ్ఞానం మరియు

- తరువాయి 2లో..

# ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల అవగాహన సదస్సు





కాకినాడ, మేజర్ న్యూస్ : స్థానిక సాంబమూర్తి నగర్‌లో గల ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో డిసెంబర్ 10వ తేది మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలలకు ముఖ్యంగా మహిళలకు వుండే ప్రాథమిక హక్కులను తెలియపరచటమే ఉద్దేశ్యంగా కళాశాలలో సెట్‌రాజ్ మరియు కళాశాల ఎన్.ఎస్.ఎస్. సంయుక్తంగా అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ తెలిపారు.

ఈ సందర్భంగా ఆదిత్య డిగ్రీ మరియు పి.జి. కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డా॥ బి.యి.వి.యల్ నాయుడు మాట్లాడుతూ స్వతంత్రంగా మాట్లాడే హక్కు, ఓటు హక్కు, జీవించే హక్కు తదితర హక్కుల గురించి అవగాహన కల్పించవలసిన అవసరం ఎంతైన ఉందని, ఓటు హక్కు ప్రాథమిక హక్కు అని తెలియక దుర్వినియోగం చేస్తున్నట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ మాటాడుతూ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం పై అన్ని సభ్యదేశాలను, సంస్థలను ఆహ్వానించి సాధారణ సభ 423(ఐ) తీర్మానానికి ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి అన్ని దేశాలు డిసెంబర్ 10తేదిన మానవ హక్కుల దినోత్సవం జరుపుకుంటున్నారని తెలిపారు. సెట్‌రాజ్ సీఈవో కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ కుల, మత, లింగ విభేదాలు లేకుండా అందరికీ సమానంగా పలు హక్కులు కల్పించబడినవి అని, విద్యా హక్కు కూడా ఉందని, ముఖ్యంగా ఇప్పటికీ అమ్మాయిలకు చదువు ఎందుకు? అనేవారు వుంటారని, కాని మహిళలను ప్రోత్సహిస్తూ ప్రత్యేకంగా మహిళా కళాశాల నిర్వహించటం ప్రశంసనీయం అన్నారు.

ఈ కార్యక్రమంలో డా॥ స్వాతి మెట్ల ప్రొఫెసర్, విజెఐఎం మాట్లాడుతూ ఆర్టికల్స్ మీద విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీని ట్రైన్ నుంచి దింపేసిన సంఘటన పట్ల అవగాహన కల్పించి, వివక్షత ఎలా ఉండేదో వివరించారు. ప్రతి ఒక్కరు తమకున్న హక్కులను తెలుసుకుని మిగతా వారికి అవగాన కల్పించాలని అన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.నాగ శ్రీకాంత్ మాట్లాడుతూ మహిళలు, చిన్న పిల్లల మీద జరుగుతున్న అరాచకాలు అరికట్టడానికి పోక్సో చట్టం వంటి వాటి మీద కనీస అవగాహన లేనివారు వున్నారని, చట్టం ముందు అందరూ సమానమే, సమన్యాయ పాలన అమలు చేయబడుతుంది అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో సెట్‌రాజ్ సూపరింటెండెంట్ జగన్నాధరావు, ఫీల్డ్ ఆఫీసర్ గౌతమ్, ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ పి.సురేఖా దేవి, అధిక సంఖ్యలో విద్యార్థినులు మరియు ఎన్.ఎస్.ఎస్. వాలంటీర్లు పాల్గొన్నారు.

# మానవ హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మానవ హక్కుల దినోత్సవం అంటే కేవలం సభలు, నినాదాలకు పరిమితం కాకుండా బాధలో ఉన్నవారికి అండగా నిలబడడమే నిజమైన మానవ హక్కుల పరిరక్షణ అని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి, మాజీ శాసనసభ్యులు శీతంశెట్టి వెంకటేశ్వరరావు స్పష్టంచేశారు. గర్భిణీ మహిళల హక్కులే అసలైన మానవ హక్కులు అని జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా వారు సందేశం ఇచ్చారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరంలో జాతీయ మానవ హక్కుల పరిరక్షణ కమిషన్ అధ్యక్షురాలు డాక్టర్ ఆర్.వి. లక్ష్మి ఆదేశాల మేరకు, నేషనల్ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షులు మెహర్ బాబా గౌడు ఆధ్వర్యంలో రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రిలో గర్భిణీ మహిళల కోసం సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలు ఎదుర్కొంటున్న ఆహారం, ఆరోగ్యం ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఈ కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. గర్భిణీ మహిళల ఆరోగ్యం కాపాడటమే భవిష్యత్ తరాల రక్షణ అని భావించి, వారికి పోషకాహారం అందించడానికి రొట్టెలు, పళ్ళు అలాగే చలికాలాన్ని దృష్టిలో పెట్టుకుని రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ చోళ్ల బొజ్జి రెడ్డి, మాజీ శాసనసభ్యులు శీతంశెట్టి వెంకటేశ్వరరావు చేతులు మీదుగా గర్భిణీ



మహిళలకు అవసరమైన సరుకులు అందజేశారు. దేవీపట్నం రైతు అధికార ప్రతినిధి దాకారపు సత్యనారాయణ, అలాగే కొత్తపల్లి అన్న చేతులు మీదుగా మరికొందరు గర్భిణీ మహిళలకు సహాయ సామగ్రి పంపిణీ చేసారు. సమాజంలో వివిధ వర్గాల ప్రతినిధులు భాగస్వాములై ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. గర్భిణీ మహిళల ఆరోగ్యం పట్ల అవగాహన కల్పిస్తూ, సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం, పోషకాహారం తీసుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. ప్రత్యేకంగా గిరిజన, వెనుకబడిన ప్రాంతాల మహిళలకు ఇలాంటి సేవా కార్యక్రమాలు ఎంతో అవసరమని స్థానికులు పేర్కొన్నారు.

# సమాజ హితం కోసం ప్రకృతి వ్యవసాయం

మొదటిపేజి తరువాయి

ముడిపదార్ధాలను అందుబాటులోకి తీసుకువస్తుందని ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ కాకినాడ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఏలియాజర్, రిసోర్స్ మేనేజ్‌మెంట్ ట్రైనింగ్ శివచక్రం పర్యవేక్షణలో ఏర్పాటైన ఈ కేంద్రం రైతులందరికీ ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని విజయరామ్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి మండలంలో ఇటువంటి ఇన్పుట్స్ రిసోర్సెస్ సెంటర్‌లను ఏర్పాటు చేయాలన్న ఆలోచనలో భాగంగా, ప్రకృతి రాగ సంస్థ ఈ కేంద్రాన్ని ప్రారంభించడం శుభ పరిణామమని ప్రశంసించారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అనేక రాయితీలను ప్రకటించడమే కాక, జిల్లా స్థాయిలో వ్యవసాయ శాఖలో దీనికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గో ఆధారిత ఉత్పత్తుల ద్వారా వ్యవసాయంలో వినియోగించడం వల్ల ఈ తరం, రాబోయే తరం కూడా లబ్ది పొందుతాయని విజయరామ్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా, విద్యార్థి దశ నుండే ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పరిచయం చేయాల్సిన కర్తవ్యం ప్రభుత్వాలకు, వ్యవసాయ శాఖ అధికారులకు ఉందని ఆయన గుర్తు చేశారు. ఈ సందర్భంగా, క్షేత్రస్థాయిలో ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన అగ్రికల్చర్ స్టూడెంట్స్‌తో కలిసి విజయరామ్ చేసిన కార్యక్రమాలు గ్రామీణ ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేషనల్ ఫార్మింగ్ ప్రతినిధులతో పాటు, ప్రకృతి రాగ సంస్థ ప్రతినిధుల బృందం నుంచి సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, ఫణీంద్ర, శివ సాయి కుమార్, బి.వి.ఎస్. నారాయణ, టి.శివ, జయ కుమార్, ఇంజనీర్ సాయి ప్రసాద్, ఐడియల్ ఇంజనీరింగ్ కాలేజీ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ హెచ్.ఓ.డి రాజు, మరియు కాలేజీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# రామచంద్రపురం వాసులకు 'బిగ్' రిలీఫ్...

మొదటిపేజి తరువాయి

అంతేకాకుండా, రామచంద్రపురం నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అవసరమైన అదనపు నిధులను కేటాయిస్తానని సీఎం మాటిచ్చారు.

**మంత్రి సుభాష్ కృతజ్ఞతలు...**

రామచంద్రపురం ప్రజల ఆకాంక్షను నెరవేర్చినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంత్రి సుభాష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "రామచంద్రపురం డివిజన్ తరలిపోతుందని వస్తున్న వార్తల్లో నిజం లేదు. ప్రజలు అపోహలు నమ్మవద్దు. యథావిధిగా ఇక్కడి నుంచే పాలన సాగుతుంది" అని స్పష్టం చేశారు.

**రైతన్నలకు శుభవార్త**

ఇదే సందర్భంలో మంత్రి సుభాష్ రైతాంగ సమస్యలపై కూడా కీలక ప్రకటన చేశారు.

**- ధాన్యం సేకరణ :** రైతుల కోరిక మేరకు ధాన్యం కొనుగోలు పరిధిని 50 కిలోమీటర్ల వరకు పెంచినట్లు తెలిపారు.

**- మద్దతు ధర :** రైతులకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకున్నామని, మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకుండా అధికార యంత్రాంగం ద్వారా కఠిన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.

రామచంద్రపురం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పునరుద్ఘాటించారు. రామచంద్రపురం నియోజవర్గంలోని ప్రజలు ఈ ప్రకటనతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. సమర్థ గల మంత్రి సుభాష్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నారని కొనియాడుతున్నారు.

# సత్యదేవుని సన్నిధిలో నూతన శకం

మొదటిపేజి తరువాయి

నీళ్ల సీసాల వరకు ప్రతిదీ అధిక ధరలకే విక్రయిస్తున్నారు. ప్రతి షాపు ముందు ధరల పట్టిక తప్పనిసరి చేయాలి.

**- సేవల్లో పారదర్శకత :** కేశఖండనశాల, వసతి గదులు, పార్కింగ్, పెళ్లిళ్ల రిజిస్ట్రేషన్ల వద్ద అనధికార వ్యవహారాలకు చెక్ పెట్టాలని భక్తుల కోరిక...

**నూతన ఈవో ముందున్న తక్షణ కర్తవ్యాలు**

**కల్తీ నెయ్యి అనే పదం లేని కమ్మని ప్రసాదం :** అన్నవరం ప్రసాదానికి ఉన్న విశిష్టతను కాపాడుతూ.. తయారీలో స్వచ్ఛమైన నెయ్యి, నాణ్యమైన ముడిసరుకులు వాడేలా కఠిన చర్యలు తీసుకోవాలి. తయారీశాలలో పరిశుభ్రత ప్రమాణాలు పెంచాలి.

**మౌలిక వసతుల కల్పన :**వ్రతం ఆచరించడం కోసం వచ్చే భక్తులకు మంచినీరు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, వృద్ధులకు ప్రత్యేక సదుపాయాలు కల్పించాలి.టెండర్లలో పారదర్శకత దేవస్థానం కాంట్రాక్టులు, షాపుల వేలంపాటల్లో పక్షపాతం లేకుండా, పూర్తి పారదర్శకతతో వ్యవహరించాలి.

**ఈవో బాధ్యతలు - భక్తుల విజ్ఞప్తులు**

- ఆగమ శాస్త్రం ప్రకారం స్వామివారి నిత్య కైంకర్యాలు, ఉత్సవాలు లోపం లేకుండా జరగాలి.
- ఆస్తుల రక్షణ దేవస్థానం భూములు అన్యాక్రాంతం కాకుండా ఆస్తుల రక్షణ కటింగ్ చర్యలు తీసుకోవాలి.
- భక్తులతో ఆలయ ఉద్యోగులు, సిబ్బంది మర్యాదగా ప్రవర్తించేలా కౌన్సిలింగ్ ఇవ్వాలి. అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోవాలి.అపార అనుభవం ఉన్న అధికారిగా వేంద్ర త్రినాథ్ రావు అన్నవరం కొండపై ఉన్న "వసూళ్ల మకిలి"ని వదిలించి, భక్తులకు ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణాన్ని అందిస్తారని ఆశిద్దాం.
- ఘాట్ రోడ్డు భద్రతకు.. తరచుగా జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి ఘాట్ రోడ్డులో సీసీ కెమెరాలు, స్పీడ్ బ్రేకర్లు, రక్షణ గోడల పటిష్టతపై దృష్టి సారించాలి. ఆన్‌లైన్ సేవలు గదుల బుకింగ్, వ్రత టిక్కెట్లు ఆన్‌లైన్‌లో సులభంగా దొరికేలా వెబ్‌సైట్‌ను ఇంకా బాగా మెరుగుపరచాలి. దళారుల ప్రమేయం తగ్గించడానికి ఇది ఉపయోగపడుతుంది.పర్యావరణ పరిరక్షణకి కొండపై ప్లాస్టిక్ నిషేధాన్ని కఠినంగా అమలు చేసి, పర్యావరణాన్ని కాపాడాలి.
- భక్తుల ఫిర్యాదుల విభాగం మెరుగుపరిచిభక్తులు తమ సమస్యలను వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావడానికి ఒక టోల్-ఫ్రీ నంబర్ లేదా ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలి. భక్తులు ఇచ్చే ఫిర్యాదులకు రసీదులు ఇవ్వాలి. వైద్య సదుపాయం భక్తులకు కొండపై అత్యవసర వైద్య చికిత్స కోసం 24 గంటల ఆసుపత్రి లేదా డిస్పెన్సరీని ఆధునీకరించాలి.భక్తులకు మెరుగైన వసతులు, సత్యదేవునిపై పూర్తి నమ్మకం, కొండపై ఆధ్యాత్మిక వాతావరణం పెంపొందించడానికి వీటన్నిటిని సాధించడం నూతన కార్యనిర్వాహనాధికారి వేంద్ర త్రినాథ్ రావుపై ఉంది.

# మానవ హక్కు - మనిషి జీవన హక్కు

– ప్రిన్సిపల్ డి.సునీత




**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** ఏలేశ్వరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మానవహక్కుల దినోత్సవమును కళాశాల పోలిటికల్‌సైన్స్ , హిస్టరి, ఎకనమిక్స్ అండ్ ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ డా.డి.సునీత అధ్యక్షత వహించి మాట్లాడుతూ జాతి, వర్ణ, లింగ, కుల, మత, రాజకీయ కారణాలతో వివక్ష లేని జీవనం గడపడం, చిత్రహింసలు, క్రూరత్వం నుంచి బయటపడటం, వెట్టిచాకిరీ, బానిసత్వం వంటి దురాచారాల నుంచి రక్షణ, నిష్పాక్షిక, బహిరంగ విచారణ పొందే హక్కు, స్వేచ్ఛగా స్వదేశం లో, విదేశాలలో పర్యటించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉన్నాయని వీటిని సక్రమైన మార్గంలో ఉపయోగించాలని తెలియజేశారు. ముఖ్య అతిధిగా కాకినాడ జిల్లా మానవహక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో జరిగిన ప్రతీ పోరాటమూ హక్కుల కోసమని, రాచరికాల దగ్గర నుండి ప్రజాస్వామ్య రాజ్యాల వరకూ ప్రజలు తమ హక్కుల కోసం వాటి రక్షణ కోసం పోరాడారని, 20 వ శతాబ్ధంలో ఈ మానవహక్కులపై ప్రభుత్వాలు రక్షణాలు కల్పించాయని, యునైటెడ్ నేషన్స్ సభ్య రాజ్యాలు 1948 డిసెంబరు 10వ తేదీన మానవ హక్కులపై ఒక తీర్మానాన్ని విడుదల చేశారన్నారు. మానవ హక్కులకు బంగం కలిగితే సంబందిత శాఖకు ఫిర్యాదు చేయాలని తెలియ జేశారు. కార్య క్రమంలో వైస్ ప్రిన్సిపల్ కె. వేంకటేశ్వర రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. ప్రయాగ మూర్తి ప్రగడ ఆర్ఆర్‌సి కొ–ఆర్డినేటర్ డా.ఎస్‌కే మదీనా, అద్యపకులు విరామ రావు ,కె.సురేష్. డా.శివప్రసాద్. వీరభద్ర రావు,శ్రీ లక్ష్మి,డా.కె బంగార్రాజు,మేరి రొసిలిన పుష్పా సతీశ్, అధ్యాపకేతర సిబ్బంది సత్యనారాయణ, ధర్మ రాజు, దివ్య,రామలక్ష్మి కమల, కళావతి, విద్యార్ధిని విద్యార్ధులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్దశ - ఎంపీపీ గొల్లపల్లి



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో రహదారులకు మహర్ధశ కలిగిందని కాకినాడ జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు ఏలేశ్వరం మండల ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుకుల సత్య ప్రభ రాజా నియోజకవర్గంలో ఉన్న రహదారుల సమస్యలపై స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ ల దృష్టి తీసుకువెళ్లి పంచాయతీరాజ్ నిధుల నుంచి కోట్లాది రూపాయలు మంజూరు చేయించారన్నారు. దీనిలో భాగంగా మండల పరిధిలోని మర్రివీడు రహదారికి 1.4 కోట్లు, జాతీయ రహదారికి అనుసంధానం చేసే చిన్నంపేట, చిన్న శంకర్ల పూడి రహదారికి 2.22 కోట్ల రూపాయలు మేర నిధులు మంజూరు చేయించారన్నారు. ప్రత్యేక శ్రద్ధతో నిధులు మంజూరు చేయించిన ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు తెలుగుదేశం పార్టీ తరఫున కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పెద్దనాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎంపీపీ సీత ఈశ్వరి చారిటబుల్ ట్రస్ట్ తరఫున తన సొంత నిధులతో సౌండ్ స్పీకర్ ను వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సుంకర సత్తిబాబు, ప్రత్తిపాడు మార్కెట్ కమిటీ సభ్యు శెట్టి అప్పారావు పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# భూసార పరీక్షలపై విద్యార్ధులకు శిక్షణా తరగతులు



ఏలేశ్వరం, మేజర్ న్యూస్ : కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎంపిక చేసిన స్కూల్స్, ఉన్నత పాఠశాలల్లో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ )వ్యవసాయ శాఖ పర్యవేక్షణలో మట్టి నమూనా సేకరణ మరియు పరీక్ష విధానాలపై పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం బుధవారం ఏలేశ్వరం గురుకుల పాఠశాల అలాగే లింగంపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వ్యవసాయ అధికారి పీకేవీ లక్ష్మి ఎస్టిఎల్ సామర్లకోట మట్టి నమూనా సేకరణ మరియు పరీక్ష విధానాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పంటలు దిగుబడులు బాగా రావాలంటే ఖచ్చితంగా భూసార పరీక్ష చేయించి సమతుల్య పోషకాల ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం ఆత్మ బి.టి.యం. నీలి బాబురావు సేకరించిన మట్టి నమూనా వివరాలను మొబైల్ యాప్ లో ఆన్లైన్ చేసే విధానమును విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలో ఉపాధ్యాయులు వ్యవసాయ సహాయకు రాలు సత్య, రాజ్ కుమార్, దీప్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, విద్యార్ధులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలు సాధించిన ఆదిత్య డిగ్రీ కళాశాల కళాశాల విద్యార్థులు




**కాకినాడ, మేజర్ న్యూస్ :** స్థానిక ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల(స్వయం ప్రతిపత్తి)కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిషరీస్, ఆక్వాకల్చర్ విద్యార్థులు హైదరాబాద్‌లో గల ప్రముఖ సంస్థ జెంటిల్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, నిర్వహించిన క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లో పలువురు విద్యార్థులు విజయవంతంగా ఎంపికై ఆఫర్ లెటర్లు అందుకున్నారని ఆదిత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. క్యాంపస్ ఇంటర్వ్యూలో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రెటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణా రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ నాయుడు, ఆక్వా కల్చర్ మరియు ఫిషరీస్ విభాగాధిపతి డాక్టర్ కే ఎన్ మూర్తి అభినందించారు. ఈ సుదీర్ఘ సహకారానికి మరొక అడుగుగా, ఫిషరీస్ మరియు ఆక్వాకల్చర్ విభాగం జెంటిల్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో ఒక ముఖ్యమైన ఒక ఒప్పందాన్ని (ఎం ఓ యు) కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, శిక్షణలు, పరిశోధనా అవకాశాలు, మరియు ఇండస్ట్రీ–అకడమిక్ సహకారం మరింత బలోపేతం కానున్నాయని అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి అవకాశాలు కల్పించినందుకు జెంటిల్ బయోసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు, ముఖ్యంగా మేనేజింగ్ డైరెక్టర్ జీ.ఎన్.వి.ఎస్.ఎస్. రాంబాబుకి, టెక్నికల్ మేనేజర్ డా.చందుకి, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్ శ్రీనివాస్‌కి, మరియు జెంటిల్ బయోసైన్స్ ప్యానల్ సభ్యులందరికీ ఆదిత్య యాజమాన్యం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసింది.

## అధ్వాన్నంగా ఉన్న రహదారులకు తారురోడ్లు నిర్మించండి

– కలెక్టర్‌ను కలిసిన టిడిపి సీనియర్ నాయకులు గణజాల తాతారావ్



**రాజవొమ్మంగి, మేజర్ న్యూస్ :** మండలంలోని లోతట్టు ప్రాంతాల గిరిజనులు వివిధ రకాల పనుల మీద మైదాన, మండల హెడ్ క్వార్టర్లకు రాకపోకలు సాగించాలంటే రహదారులు అధ్వానంగా ఉన్నాయని తారు రోడ్లు నిర్మించాలని మండల సీనియర్ టిడిపి నాయకులు గణజాల తాతారావు పాడేరులో జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. మండలంలో అమీనాబాద్ వణకరాయి గ్రామం నుండి కొత్తవారి వీధివరకూ, మద్దిబందల జంక్షన్ నుండి మద్దిబంధల గ్రామం మీదుగా చికిలింత కాలనీ వరకూ,. మద్దిబం ధల నుండి లోతా వారి వీధివరకు,చికిలింత నుండి పెదరెల్లంగిపాడు మీదుగా వాతంగి వరకూతారు రోడ్లు నిర్మించాలని,ఆయా ప్రాంతాల ప్రజలు అనునిత్యం నిత్యావసరాలకు వెళ్లడానికి వీలుగా ప్రయాణాల రాకపోకలకు వీలుగా ప్రస్తుతం వున్న పెద్దపెద్ద గుంతలు, బురదమయ, లేచిపోయిన మెటల్ రోడ్లతో ప్రజలు ఇబ్బందులు పడుచున్నారని,వారి కష్టాలు గట్టెక్కేవిధంగా తారు రోడ్లు నిర్మించి గిరిజన ప్రాంత అభివృద్ధికి దోహదపడగలందుకు కోరుచున్నామని పాడేరులోజిల్లా కలెక్టర్ దినేష్ కుమార్‌ని గణజాల తాతారావ్ కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తాతారావ్ మీడియాకు తెలిపారు.

సూర్య
www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# టీడీపీ జిల్లా పీఠం పల్లంరాజుకేనా..!?





- అధిష్ఠానం పరిశీలనలో ముందువరస..?
- కాపులకే జిల్లా అధ్యక్ష పదవి దక్కాలంటున్న నేతలు..
- ఇదే జరిగితే జిల్లా పీఠం దక్కే అవకాశాలున్నాయంటున్న విశ్లేషకులు..

**అమలాపురం,మేజర్‌న్యూస్ :** టీడీపీ జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి.జిల్లాల పునర్విభజన తరువాత అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్ష పీఠంపైనే ఇప్పుడు అందరి దృష్టి కొనసాగుతోంది.. అయితే ఇప్పటికే జిల్లాకు చెందిన రెండు ప్రముఖ సామాజికవర్గాలకు చెందిన పలువురి సీనియర్ నాయకుల పేర్లను పరిశీలించిన అధిష్ఠానం ఇంకా పూర్తిస్థాయిలో సమగ్ర నివేదిక కోసమే వేచిచూస్తున్నట్లు తెలుస్తోంది.. అయితే అనూహ్యంగా టీడీపీ సీనియర్ నేత గంధం పల్లంరాజు పేరుకూడా ఈజాబితాలో చేరడం చర్చనీయాంశం అయ్యింది.. నిజానికి ఆయన తాను ఈ పదవికోసం ఎటువంటి ప్రయత్నం చేయడం లేదని ఇప్పటికే ప్రకటించినప్పటికీ అధిష్ఠానం మాత్రం సామాజిక సమీకరణల్లో భాగంగా పల్లంరాజు పేరును ప్రత్యేకంగా పరిశీలిస్తున్నట్లు సమాచారం.. గతంలో కూడా అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు పర్యటనలో చురుగ్గా పాల్గొనడమే కాకుండా ఏకంగా ఆయన వాహనంలో ప్రయాణించే అవకాశాన్ని దక్కించుకున్న పల్లంరాజు టీడీపీలో తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు..అంతేకాకుండా యువనాయకుడు లోకేష్‌కు సుపరిచితుడై ఉండడం, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌తో స్నేహబంధం కలిసొచ్చే అంశంగా కనిపిస్తోంది.. ఈ క్రమంలోనే ఒక వేళ కాపు సామాజికవర్గానికి జిల్లా పీఠం దక్కే అవకాశం ఉంటే గనుక పల్లంరాజు పేరు ప్రథమ వరుసలో పరిశీలనలో ఉన్నట్లు తెలుస్తోంది..

**కాపు సామాజికవర్గానికే ఇవ్వాలంటూ పట్టు..**అంబేద్కర్ కోనసీమ జిల్లా అనగానే కాపు సామాజికవర్గాల ఆధిక్యత ఎక్కువ.. అందులోనూ టీడీపీలో కూడా కాపు సీనియర్ నాయకులు చాలా మంది ఉన్నారు. అయితే టీడీపీనే నమ్ముకుని పార్టీలో ఎప్పటినుంచో ఉన్న కాపు టీడీపీ సీనియర్ నాయకులకు ఇప్పటివరకు చెప్పుకోదగ్గ పదవులు లభించలేదనే చెప్పాలి.. ఇప్పుడు ఇదే అంశం గంధం పల్లంరాజుకు కలిసిరానుందా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం వినిపిస్తోంది.. బీసీ వర్గాలకు సంబంధించి శెట్టిబలిజ సామాజికవర్గంకు చెందిన సీనియర్ నాయకులకు చాలా మందికి టీడీపీలో ఉన్నత స్థాయి పదవులు దక్కాయి.. ఇప్పుడు ఇదే అంశం జిల్లా అధ్యక్ష పదవి విషయంలో ఆ వర్గ నాయకులకు ఆటంకంగా మారినట్లు తెలుస్తోంది.. ఈ నేపథ్యంలోనే టీడీపీలో కాపు సామాజికవర్గం నుంచి ఎప్పటినుంచో సీనియర్లుగా ఉన్న వారికేటీడీపీజిల్లాఅధ్యక్షపీఠంకేటాయించాలన్నడిమాండ్ ఊపందుకుంది..

**సమర్థతకే ప్రాధాన్యత నిస్తోందా..**కూటమిలో ప్రధాన భాగస్వామి పాత్ర పోషిస్తోన్న టీడీపీలో ఇప్పుడు పార్టీని జిల్లాలో సమర్థవంతంగా నడిపించేందుకు అన్నివిధాలుగా సమర్థవంతమైన నాయకత్వం అవసరం కాగా దానికి తగ్గ నాయకుని కోసం అధిష్ఠానం అన్వేషిస్తోంది.. దీంట్లో భాగంగానే టీడీపీలో సీనియర్ నేతగా ఉన్న గంధం పల్లంరాజు పేరు ముందు వరుసలో ఉన్నట్లు తెలుస్తోంది.. దీనికి తోడు కులాల ఐక్యత నినాదంతో ఎన్నికల ముందు నుంచి కాపు, శెట్టిబలిజల ఐక్యతారాగాన్ని ముందుంచి నడిపించిన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, టీడీపీ సీనియర్ నేత గంధం పల్లంరాజు మంచి స్నేహితులు కావడం కూడా కలిసొచ్చే అంశంగా మారిందంటున్నారు. ఏది ఏమైనా అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్ష పీఠం విషయంలో సమర్థతకే ప్రాధాన్యతనిచ్చే పరిస్థితి ఉందంటున్నారు.

## వెనుకబడిన వర్గాలను ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** వెనుకబడిన వర్గాలను ఆదుకోవడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని కూటమి అధికారంలోకి వచ్చాక సీ.ఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తు చేసుకున్నవారందరికీ అందిస్తున్నారని కాకినాడ జిల్లా టిడిపి అధ్యక్షులు, జగ్గంపేట నియోజకవర్గం అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ అన్నారు. రావులమ్మ నగర్ లోని టిడిపి కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో జ్యోతుల నవీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్, అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరంగా మారిందని వ్యాఖ్యానించారు. మన ప్రభుత్వంలో ఇప్పటికే అనేక దఫాలుగా కోట్లాది రూపాయల చెక్కులను పంపిణీ చేశామన్నారు. పేదలందరికీ న్యాయం చేస్తున్నామన్నారు. మరికొన్ని చెక్కులు మంజూరు అయినట్లు సీఎం కార్యాలయం నుంచి సందేశం వచ్చిందని త్వరలోనే వాటిని సైతం పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ పైన మన నియోజకవర్గంపైన అభిమానంతో పంపిన దరఖాస్తులన్నీ ఆమోదిస్తున్నారని, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిలీఫ్ ఫండ్ అందుతుందని వ్యాఖ్యానించారు. బుధవారం నియోజవర్గంలోని 27 మందికి 17 లక్షల 78 వేల రూపాయలు విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తోట రవి, ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, తోట గాంధీ, నీలం శ్రీను, పాండ్రంగి రాంబాబు, రేఖ బుల్లి రాజు, పాఠంశెట్టి రవి, కుంచే తాతాజీ, జ్యోతుల రాంబాబు, ఎస్ బాబు, రాయి సాయి, నలమహారాజు, బుసాల విష్ణు, బాలనాగు, కురుకూరి చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

## సామర్లకోట ఎస్సైగా నియమితులైన ఎం.రాజా



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట సబ్ ఇన్స్పెక్టర్‌గా ఎం రాజా నియమితులయ్యారు. ఈయన కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో గత ఆరు నెలలుగా ట్రైనీ ఎస్సైగా విధులు నిర్వహించారు. ట్రైనింగ్ పూర్తి చేసిన అనంతరం కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఐపీఎస్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ట్రైనింగ్ పూర్తయిన అనంతరం సామర్లకోట ఎస్సైగా నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ రాజాను పలువురు అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## స్వార్థ ప్రయోజనాల కోసమే మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ

- పిఠాపురం వైఎస్ఆర్‌సిపి ఇన్చార్జి వంగా గీతా విశ్వనాథ్



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** స్వార్థ ప్రయోజనాల కోసమే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు అడుగులు వేస్తున్నారని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను ప్రజలంతా తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పిఠాపురం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కోటి సంతకాల సేకరణ పత్రాలను పిఠాపురం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి కాకినాడ జిల్లా కేంద్రానికి తరలించే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. స్థానిక పార్టీ కార్యాలయం నుంచి ఉప్పాడ సెంటర్ వరకు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వంగా గీతా విశ్వనాథ్ మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రయివేటీ కరణను వ్యతిరేకిస్తూ... కోటి సంతకాల సేకరణకు మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నామని, మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆవైద్య విద్యను రాష్ట్ర నలుమూలలా విస్తరించి అందరికి అందుబాటులోకి తెచ్చారని అన్నారు. ఐదేళ్ల పాలనలోనే 17 మెడికల్ కాలేజీలు తెచ్చారని, పేదలకు వైద్యాన్ని అందించేందుకు ఆరోగ్యశ్రీని రూ. 25 లక్షలకు పెంచారని, కానీ చంద్రబాబు దృష్టిలో వైద్యం అంటే ధనాన్ని తెచ్చిపెట్టే యంత్రంలా మారిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందించడమే లక్ష్యం

- విశాల్ ఆరోగ్యాభివృద్ధిలో భాగంగా ఆరోగ్య కేంద్రాల నిర్మాణం
- ఎమ్మెల్యే బండారు



**కొత్తపేట,మేజర్‌న్యూస్ :** నియోజకవర్గ ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్య సేవలు అందించేందుకు ఆరోగ్య కేంద్రాల నిర్మాణం చేపట్టినట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు.దేశవ్యాప్తంగా వైద్య ఆరోగ్య రంగంలో జరుగుతున్న మౌలిక వసతుల అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది రాష్ట్రంలో వైద్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు చేపట్టిన చర్యలలో భాగంగా కొత్తపేట నియోజకవర్గానికి మొత్తం 35 విలేజ్ హెల్త్ క్లినిక్స్ (వి హెచ్ సి ఎస్)2 బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్లు మంజూరు అయినట్లు అన్నారు.ఆ మేరకు వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ అధికారిక లేఖ ద్వారా వివరాలు తెలియజేశారు.కొత్తపేట నియోజకవర్గ ప్రజలకు నాణ్యమైన ఆధునిక వైద్య సేవలు అందించాల న్న లక్ష్యంతో రూ13.71 కోట్ల రూపాయల వ్యయంతో ఆరోగ్య కేంద్రాల నిర్మాణం అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు.ఎమ్మెల్యే బండారు మాట్లాడుతూ ఈ నిర్మాణాలు పూర్తికాగానే నియోజకవర్గ ప్రజలకు అత్యుత్తమ ఆరోగ్య సేవలు చేరువలో అందుబాటులోకి వస్తాయని గ్రామీణ స్థాయిలో వైద్యం మరింత బలపడు తుందని పేర్కొన్నారు. ఆరోగ్య సదుపాయాల విస్తరణ కొత్తపేట అభివృద్ధిలో మరొక కీలక అడుగుగా నిలు స్తుందని తెలిపా రు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రధాని నరేంద్ర మోది,ముఖ్యమంత్రి చంద్రబాబు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్ లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని అత్యంత పారదర్శకంగా నిర్వహించాలి

– కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉచిత ఇసుక పాలసీ విధా నాన్ని అత్యంత పారదర్శకంగా జవాబుదారీతనంతో నిర్వహించడానికి జిల్లా స్థాయి ఇసుక కమిటీ పటిష్టమైన చర్యలు గైకొనాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నందు జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కమిటీ చైర్మన్ మహేష్ కుమార్ అధ్యక్షతన కమిటీ సభ్యులతో నిర్వహించి ఉచిత ఇసుక పాలసీ టెండర్ల ప్రక్రియ అంశాలు కొత్త ఇసుక రీచ్‌లు అప్రూవల్, కొత్త ఇసుక రీచులకు టెండర్ నోటిఫి కేషన్ జారీ ఇత్యాది అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సెమీ మేకనైజడ్ నాలుగు రీచ్‌లకు టెండర్లు ప్రక్రియ ఈ నెల 12 నుండి నిర్వహించ నున్నట్లు వెల్లడించారు. వీటిలో మెర్లపాలెం, కపిలేశ్వరపురం, ఆలమూరు, జొన్నాడ రీచులు ఉన్నాయన్నారు. టెండర్‌దార్ల నియమ నిబంధనలు అర్హతలు, సాంకేతిక క్యాబబులిటీ, వార్షిక ఆదాయ విధానాలు లైసెన్సులు వాటిపై సమీక్షించి తగు సూచనలు చేశారు. స్టాక్‌యార్డ్‌ల లీజు అంశాలపై తాసిల్దార్లతో సర్టిఫికేషన్ చేయించాలని సూచిం చారు, అదేవిధంగా లీజుదారుల నో అబ్జెక్షన్ ధ్రువపత్రాలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనానికి జిపిఎస్ కోఆర్డినేట్స్ ఉండాల న్నారు. ఏటిగట్లపై ఇసుక లోడుతో రాకపోకలు రవాణాను నిర్వహించకుండా జల వనరులశాఖ నిఘా ఉంచాలని, ప్రయాణం తగ్గుతుందనే ఉద్దేశంతో ఏటిగట్లపై ఇసుక లోడుతో రాకపోకలు సాగిస్తారని తద్వారా ఏటిగట్లు బలహీనపడే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిపాదిత నిర్దేశిత మార్గాలలోనే ఇసుక రవాణా జిపిఎస్ కోఆర్డినేట్స్‌తో నిర్వహించాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్లు బ్రిడ్జిలు, వంతెనలు కండిషన్స్ ప్రకారం మాత్రమే వాహనాలు రాకపోకలు నిర్వహించా లన్నారు. ఈ నెల 12వ తేదీన ఈ నాలుగు రీచులకు టెండర్లు స్థానిక కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ వారి ఛాంబర్ నందు ప్రక్రియ ప్రారంభించడం జరుగుతుందని, ఈనెల 17వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు టెండర్లు దాఖలు చేయవచ్చునని, 18వ తేదీ టెండర్లు పరిశీలన అనంతరం అర్హత సాధించిన టెండర్‌దారుల పేర్లతో తుది జాబితా ప్రకటన ఉంటుందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గనులు భూగర్భ శాఖ ఎల్.వంశీధర్ రెడ్డి, గోదావరి హెడ్ వర్క్స్ కార్య నిర్వాహక ఇంజనీర్ జి.శ్రీనివాస్, జిల్లా రవాణా అధికారి డి.శ్రీనివాసరావు, జిఎస్‌డబ్ల్యూఎస్ కోఆర్డినేటర్ సువిజయ్ జిల్లా గ్రామీణ త్రాగునీటి సరఫరా పారిశుద్ధ్యశాఖ పర్యవేక్షక ఇంజనీర్ ఏ.వీ.ఎస్.రాజన్ తదితరులు పాల్గొన్నారు.

# డిగ్రీ కళాశాలలో మానవ హక్కుల దినోత్సవం



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వైఎస్ ప్రిన్సిపాల్ డి రవికుమార్ అధ్యక్షతన చరిత్ర విభాగము అధ్యాపకురాలు సునీత పర్యవేక్షణలో బుధవారం అంతర్జా తీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వారి హక్కులను కాపాడుకోవాలని, అదేవిధంగా విధు లు తెలుసుకొని సక్రమంగా నిర్వర్తించాలని విద్యార్థులకు సూచిం చడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు చక్రవర్తి, శివ కుమారి, వెంకటేష్, డాక్టర్ మాణిక్యాలరావు, సునీత, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# పాడి రైతులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** మేలు జాతి పశువుల పెంపకంతో పాడి రైతులకు అధిక పాల దిగుబడి లభిస్తుందని కొవ్వూరు పశు సంవర్ధక శాఖ ఇంచార్జ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రాజేంద్రప్రసాద్ పాడి రైతులకు సూచించారు. పెద్దాపురం గ్రామంలో ఉచిత గర్భకోశ చికిత్స పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులు మేలి జాతి పశువులను పెంచడం ద్వారా పాల ఉత్పత్తి అధికంగా ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వం పాడి రైతులకు ఎన్నో ప్రోత్సాహకాలను అందజేస్తుందన్నారు. పాడి రైతులు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా సమయానికి వ్యాధి నిరోధక ఇంజక్షన్లు చేయడంతో పాటు పశువులపై నిరంతర పర్యవేక్షణ ఉంచాలన్నారు పశువులకు అనారోగ్య పరిస్థితులు ఎదురైనప్పుడు క్షేత్రస్థాయిలో ఉన్న పశు సంవర్ధక శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా కొందరు రైతులు మేలు రకం వీర్యాన్ని క్షేత్రస్థాయికి అందించాలని ప్రస్తుతం ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా అందిస్తున్న వీర్యం పశువుల గర్భాదారణ సమయంలో ఉపయోగించడం ద్వారా మగ దూడలు పుట్టడం ఆ పుట్టినరోజు నాసిరకంగా ఉంటున్నాయని డిప్యూటీ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా పశువులు పాము కాటుకు గురైన సమయంలో అవసరమైన ఇంజక్షన్లు అందుబాటులో లేక పశువులు మృతి చెందుతున్నాయని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పాము కాటు వ్యాక్సిన్ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచాలన్నారు.

ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డిఎం నాయక్, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ శశికుమార్, వైద్యులు డాక్టర్ ధరిన్, ఎస్.వరలక్ష్మి, వెటర్నరీ అసిస్టెంట్లు, పాడి రైతులు, టిడిపి మండల అధ్యక్షుడు కొర్లపాటి రాము, టిడిపి సీనియర్ నాయకులు కొర్లపాటి అన్నవరం, జగదీష్, ఘనమని చిట్టిబాబు, వెల్లంద్రుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు ఇల్లూరి రాము తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సమావేశంలో ఎంపీ హరీష్ బాలయోగి

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఢిల్లీలోని పార్లమెంట్ సి బ్లాక్‌లో జరిగిన కార్మిక, జౌళి మరియు నైపుణ్యాభివృద్ధి పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశంలో అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి పాల్గొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖ అధికారులతో మూడు ముఖ్య అంశాలపై సమీక్ష నిర్వహించారు.

నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పనితీరు, విదేశీ ఉపాధి కోసం సిద్ధమవుతున్న వలస కార్మికులకు అందిస్తున్న నైపుణ్య మరియు భాషా శిక్షణ, అలాగే ప్రధాన్ మంత్రి కౌశల్ వికాస్ యోజన పురోగతి గురించి చర్చించినట్లు తెలిపారు. యువతకు అందుబాటులో ఉండే అవకాశాలను, అలాగే విదేశాలకు వెళ్లే భారత కార్మికులు ఆధారపడే సహాయ వ్యవస్థలను ప్రత్యక్షంగా ప్రభావితం చేసే కీలకమైనవని, శిక్షణ కేంద్రాలపై మరింత బలమైన పర్యవేక్షణ, వలస కార్మికులకు మెరుగైన భాషా నైపుణ్యాలు వంటి సహాయం, అలాగే శిక్షణతో ఉద్యోగాలు మరియు జీవనోపాధికి దారితీసేలా పిఎంకెవై 4.0 ను మరింత స్పష్టంగా, సమర్థవంతంగా అమలు చేయాల్సిన అవసరాన్ని సభ్యులు ప్రస్తావించారన్నారు.



అదే విధంగా, కార్మిక & ఉపాధి, జౌళి మరియు స్కిల్ డెవలప్‌మెంట్ మంత్రిత్వ శాఖల 2025–26 ఆర్థిక సంవత్సర డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై సిద్ధం చేసిన 'డ్రాఫ్ట్ యాక్షన్ టేకన్ రిపోర్ట్'ను కూడా కమిటీ పరిశీలించి ఆమోదించిందని ఎంపీ హరీష్ బాలయోగి పేర్కొన్నారు.

# ఏజెన్సీలో బాల్యవివాహాలు నిర్మూలించాలి




**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** ఏజెన్సీ ప్రాంతాల్లో బాల్యవివాహాలు నిర్మూలించే బాధ్యత మనందరిపై ఉందని రంపచోడవరం మండల తహసీల్దార్ పి. బాలాజీ పేర్కొన్నారు. రంపచోడవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో బుధవారం తహసీల్దార్ బాలాజీ, ఎంపీడీవో ప్రసాద్, సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు, ఐసిడిఎస్ సిడిపిఓ కె.ఉమా బాల్య వివాహాలు నిర్మూలనపై అంగన్వాడీ సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా తహసీల్దార్ బాలాజీ మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమ శాఖ ద్వారా ప్రతి గ్రామంలో బాల్యవివాహాలు నిర్మించాలన్నారు. బాలల పరిరక్షణ, బాలల సమస్యలు, సైబర్ సెక్యూరిటీపై ప్రతి గ్రామంలో అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహలరహిత ప్రదేశాలుగా మనందరం కలిసి తీర్చిదిద్దాలన్నారు. రంపచోడవరం ఎంపీడీవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రతీ బాలిక చదువుపై దృష్టి పెట్టే విధంగా వారి అభివృద్ధికి మనవంతు తోడ్పాటు అందించాలన్నారు. ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు నిర్మూలించుటకు ఆయా గ్రామ ప్రజలతో స్నేహపూరితంగా ఉండాలన్నారు. రంపచోడవరం సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ బాల్యవివాహాలు ఎక్కడైనా జరిపించినా, పాల్గొన్నా బాధ్యులపై చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

అదేవిధంగా ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నాయని, ఎవరైనా తెలిపితే వెంటనే స్పందించి బాల్యవివాహాలు జరగకుండా నిలుపుదల చేస్తామన్నారు. రంపచోడవరం సిడిపిఓ ఉమా మాట్లాడుతూ రంపచోడవరం, దేవీపట్నం మండలాల పరిధిలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిసిన వెంటనే సంబంధిత సిడిపిఓలు, అంగన్వాడీ టీచర్లు తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ప్రతి బాలిక చదువుపై దృష్టి పెట్టి ఎదిగిన తర్వాతే పెళ్లిళ్లు చేసుకుంటే మంచిదన్నారు. ప్రభుత్వ నిబంధనలు ప్రకారం మహిళకు 18 సంవత్సరాలు, పురుషులకు 21 సంవత్సరాలు వయసు వచ్చిన తర్వాత తల్లిదండ్రులను ఒప్పించి పెండ్లి చేసుకోవాలన్నారు. బాల్యవివాహాలు చేయడం, అదేవిధంగా పాల్గొనడం చట్టరీత్యా నేరమన్నారు. ఐసిడిఎస్ సూపర్వై జర్లు, అంగన్వాడీ టీచర్లు బాల్యవివాహాలు నిర్మూలిద్దాం, బాల్యవివాహాల రహిత ఆంధ్ర ప్రదేశ్‌గా తీర్చిదిద్దం అని అందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీ పనికి వెళ్లే వ్యక్తి మృతి



**గోపాలపురం, మేజర్ న్యూస్ :** మండలంలోని రేగులకుంట గ్రామానికి ఉపాధి కూలి చల్లా సత్యనారాయణ (72) బుధ వారం పనిప్రదేశంలో మృతి చెందినట్లు ఏపీఓ జె.వి తెలిపారు. రోజువారీ పనిలో భాగంగా బుధవారం ఉదయం పనికి వచ్చి పని ప్రదేశంలో కుప్పకూలిపోయాడన్నారు.వెంటనే కుటు ంబ సభ్యులకు సమాచారమిచ్చి ద్విచక్ర వాహనంపై ఇంటికి తీసుకు వెళ్ళేసరికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు.

# అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు



సామర్లకోట, మేజర్ న్యూస్ : అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బుధవారం సామర్లకోటలో ప్రభుత్వం ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీలు సమక్షంలో మానవ హక్కుల దినోత్సవం జరుపుకోవడానికి నిర్ణయించడమైనది. ఈ కార్యక్రమానికి జిల్లా మానవ హక్కుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ అధ్యక్షతన ఈ కార్యక్రమము జరిపించుకోవడం జరుగుచున్నది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సామర్లకోట మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య హాజరై ఉన్నారు అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం జరుపుకోవడం గల కారణం మనకు ఉండే హక్కుల గురించి అనగా ప్రతి పౌరుడికి స్వేచ్ఛ స్వతంత్రం సమానత్వం తగిన గౌరవంతో బతికే హక్కులను మానవహక్కులుగా గుర్తించి సవంత్సారంలో ఐక్యరాజ్యసమితి సభ్య దేశాలు అందరూ ఏకగ్రీవంగా మానహక్కుల కమిషన్ ప్రకటించడం జరిగింది భారతదేశంలో 1993లో పార్లమెంట్లో జాతీయ మానవ హక్కుల కమిషన్ ఆమోదించబడినది అలాగే రాష్ట్రాల్లో కూడా మానవ హక్కుల కమిషన్లు ఏర్పాటు జరిగివునది. ఈ మానవ హక్కుల కమిషన్ లో సామాన్య ప్రజలు కు ఏ సమస్య అయినా పోలీసువారి నుండి గాని రెవెన్యూ వారి నుండి గాని వైద్యాధికారులు నుండి గాని మరి ఏ ఇతర శాఖల అధికారుల నుండి గాని ప్రజలకు ఇబ్బంది కలిగిన మానవ హక్కులకు భంగం కలిగిన రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ గాని జాతీయ మానవ హక్కుల కమిషన్ గాని స్వయముగా ఫిర్యాదు చేసుకొని న్యాయం పొందగలరని తెలియజేస్తున్నాను. ఎందుకంటే ఏ విధమైన ఆధారాలులేని వాళ్ళు కోర్టుకు వెళ్లలేని వారు ఈ కమిషన్ను సంపరదించినట్లయితే మీకు తప్పగా న్యాయం జరుగుతుందని తెలియజేస్తున్నాను ఒకవేళ మీకు తెలియని యెడల మా సంఘమును సంపరదించినట్లయితే మీకు మేము సహకరించగలమని తెలియపరుచుకుంటుంటారు ఈ కార్యక్రమానికి మేము నడిపించడానికి మా సంఘ సభ్యులు ఉన్నామట్ల ధనలక్ష్మి , ఉన్నామట్ల విశ్వనాధం , కాశి చంద్రావతి కాశి సిరిష , వారు ఇచ్చిన ఆర్థిక సహాయంతో మేము ఈ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది ప్రజలకు మనవి చేసేది ఒకటే మీకు ఎప్పుడైనా మీ హక్కులకి భంగం కలిగిన ఎడల మా సంఘమును ఫోనెన్యంబర్:- 9440009320 ద్వారా సంప్ర దించినట్లయితే మేము సహకరిస్తాము లేకుంటే మీరే స్వయంగా రాష్ట్ర మానవ హక్కులు కమిషన్ కర్నూల్ లో ఉంది వారిని వారికి ఫిర్యాదు చేయవచ్చును అలాగే జాతీయ మానవ హక్కుల కమిషన్ ఢిల్లీలో ఉంది వారికి కూడా మీరు ఫిర్యాదు చేయవచ్చును మీకు జరిగే ఇబ్బందులను నిలితపూర్వతముగా ఆధారాలతో మీరు ఫిర్యాదు చేసినట్లయితే తప్పనిసరిగా మీకు న్యాయం జరగలేదని తెలియజేసుకుంటున్నాను ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ ఉపాధ్యక్షులు జుత్తిక అప్పారావు, కార్యదర్శి కుంచె నని బాబు, ఎండి వల్లిభాష, ఎండి మున్వార్, మరియు సంఘ సభ్యులు, గర్భిణీ స్త్రీలు, వైద్యఅధికారులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# సోలార్ రూఫ్‌టాప్‌లను విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకోవాలి

**– ట్రాన్స్కో ఏడీఈ ఎల్. లక్ష్మీనారాయణ కిరణ్**

**సామర్లకోట, మేజర్ న్యూస్ :** విద్యుత్ వినియోగదారులందరూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం కింద సబ్సిడీ అందిస్తున్న కారణంగా ప్రతి ఒక్కరు సోలార్ రూప్ టాప్ లను సద్వినియోగం చేసుకోవాలని ట్రాన్స్కో ఏడీఈ ఎల్. లక్ష్మీనారాయణ కిరణ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రాయితీపై సోలార్ రూప్ టాప్ లు ఇంటి మీద నిర్మించుకోవడానికి విద్యుత్ బిల్లులు ఆదా చేసుకోవడానికి ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన కింద సోలార్ రూట్ టాప్ పద్ధతిన నిర్మించుకోవడానికి చర్యలు తీసుకుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఒకసారి పెట్టుబడితో ఇంటికి అవసరమైన విద్యుత్తును వాడుకొని విద్యుత్ సంస్థకు విక్రయించవచ్చు నని తెలిపారు.సోలార్ రూఫ్ టాప్ పద్ధతిలో ఒక కిలోవాటుకు 30 వేలు, 2 కిలో వాట్ కు 60 వేలు మూడు కిలో వాట్ కు 78,000 కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. సోలార్ కు చివరి తేదీ లేదని నిరంతర ప్రక్రియగా దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. దీనిలో యూనిట్ కాస్ట్ 3 కిలో వాట్ కు కేంద్ర ప్రభుత్వం 78,000 వేలు సబ్సిడీస్తుందని లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా ఋణం లభిస్తుందని లబ్ధిదారులు రూపాయి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదని తెలిపారు. ఎస్సీ ఎస్టీ వర్గాల వారికి ఈ పథకం ఉచితంగా లభిస్తుందని తెలిపారు. పెద్దాపురం రూరల్ పరిధిలో 1052 పట్టణ పరిధిలో 121 సామర్లకోట రూరల్ పరిధిలో 1148 సామర్లకోట పట్టణ



పరిధిలో 525 మంజూరయ్యాయని తెలిపారు. 200 యూనిట్లు వాడే ఎసిసి, ఎస్ వారికి ఉచితంగా లభించింది అని తెలిపారు. మిగిలిన వర్గాల వారికి మూడు కిలో వాట్ వరకు తీసుకునేందుకు ప్రభుత్వ అవకాశం కల్పించిన తెలిపారు సోలార్ కొరకు బీసీ,ఓసి వర్గాల వారు 1772 మంది దరఖాస్తులు చేసుకున్నారని వారిలో 656 మంది యూనిట్లు తీసుకున్నారని మిగిలిన వారు త్వరగా యూనిట్లు పొందాలని తెలిపారు. కమర్షియల్ వారికీ సబ్సిడీ ఉండదని వారి యూనిట్ కాస్ట్ మొత్తం చెల్లించాలని తెలిపారు. సోలార్ రూట్ టాప్ కొరకు ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చని దరఖాస్తు చేసుకున్న వాళ్లందరికీ యూనిట్లు మంజూరు చేస్తామని ఏడీకి తెలిపారు ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులందరూ సద్విని ఒక చేసుకుని సోలార్ సబ్సిడీ పొందాలని తెలిపారు.

# ఘనంగా వివేకానందలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవ వేడుకలు



జగ్గంపేట, మేజర్ న్యూస్ : స్థానిక శ్రీ స్వామి వివేకానంద విద్యాసంస్థలలో ప్రపంచ మానవ హక్కుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ప్రిన్సిపాల్, కరెస్పాండెంట్ ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రఘురామ్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిసెంబర్ 10న ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే మానవ హక్కుల దినోత్సవం అనేది మనిషి పుట్టుకతోనే పొందే స్వేచ్ఛ, సమానత, గౌరవం వంటి విలువలను గుర్తు చేస్తుందన్నారు. 1948లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన మానవ హక్కుల విశ్వ ప్రకటన ప్రపంచం మొత్తానికి ఒకే సందేశం ఇచ్చిందని ఆ సందేశమే "మనుషులందరు హక్కుల్లో సమానులు" అని తెలియజేసారు.మన దేశం వంటి ప్రజాస్వామ్యంలో మానవ హక్కులు అత్యంత ముఖ్యమైనవని. ప్రతి వ్యక్తి తన అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తపరచుకోవడం,విద్య పొందడం, గౌరవంగా జీవించడం,వివక్ష లేకుండా అవకాశాలు పొందడం ఇవన్నీ మానవ హక్కులలో భాగమేనన్నారు.మానవ హక్కులు కేవలం పుస్తకాలలోనే కాకుండా, ప్రతి ఇంటిలోను, ప్రతి పాఠశాలలోను, ప్రతి కార్యాలయంలోను అమలవ్వాలన్నారు. ఈ రోజు మనం ప్రత్యేకంగా గుర్తుంచుకోవాల్సిందేమంటే హక్కులు ఉన్నట్లే బాధ్యతలు కూడా ఉన్నాయని, మన హక్కులను రక్షించుకోవాలంటే,ఇతరుల హక్కులను కూడా గౌరవించాలన్నారు. మనం చేసే చిన్న చిన్న మంచి పనులు కూడా ఒక పెద్ద మార్పుకు కారణం కావచ్చన్నారు. మన సమాజంలో పిల్లలు, మహిళలు, వృద్ధులు, దివ్యాంగులు, సామాజికంగా వెనుకబడిన వర్గాలు వీరి హక్కులు మరింత జాగ్రత్తగా పరిరక్షించాలన్నారు.ఎవరికైనా అన్యాయం జరిగినప్పుడు నిశ్శబ్దంగా ఉండటం కూడా అన్యాయానికే మద్దతు ఇచ్చినట్టేనన్నారు.అందుకే మనం అందరం న్యాయం, సమానత్వం,మాన వత్వం అనే విలువలను నిలబెట్టాలన్నారు. ఈ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా, మన సమాజాన్ని మరింత బాధ్యతాయుతంగా, శాంతియు తంగా,మానవతా విలువలతో ముందుకు తీసుకెళ్లే ప్రతిజ్ఞ మనమందరం చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు మానవ హక్కులు తెలియజేసే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. చార్టులు,ప్లే కార్డ్స్ ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఆదిత్యలో ఉత్సాహంగా సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ వాలీబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు





గండేపల్లి, మేజర్ న్యూస్ : సూరంపాలెం సౌత్ జోన్ ఇంటర్ యూని వర్సిటీ వాలీ బాల్(పురుషుల) ఛాంపియన్ షిప్ పోటీలు జె,ఎన్.టి.యు.కె, ఆదిత్య ఇంజనీరింగ్ కళాశాల రాజీవ్ గాంధీ కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న విషయం విదితమే మొదటి రోజు పోటీలు వివిధ టీమ్ ల మధ్య హెూరాహెూరీగా సాగాయి అని ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో.ఛాన్సలర్ డా.మేడపాటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ టోర్నమెంట్ డిసెంబర్ 10 నుండి 14 వరకు 2025 వరకూ జరుగుతుంది. దక్షిణ భారతదేశంలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి మొత్తం 138 జట్లు ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. పూల్ డి – ఆదిత్య ఇంజినీరింగ్ కాలేజ్ నిర్వహణలో జరుగుతున్నాయని ఈ సంవత్సరం పోటీలు నాకౌట్ – కమ్ – లీగ్ ఫార్మాట్‌లో నిర్వహించబడుతున్నాయి. ఈ రోజు ఉదయం 7–00 గంటలకు ప్రారంభమైన పోటీలు సాయంత్రం వరకు ఉత్సాహపూరిత వాతావరణంలో ఎంతో ఉత్కంఠంగా జరిగాయి, తొలిరోజులో భాగంగా అలగప్ప యూనివర్సిటీ చెన్నై, కన్నూర్ యూనివర్సిటీ కేరళ, యూనివర్సిటీ అఫ్ అగ్రికల్చర్ అండ్ సైన్సస్, కర్ణాటక ప్రిస్ట్ యూనివర్సిటీ తాంజవుర్, తదితర యూనివర్సిటీ జట్లు పాల్గొనగా, మొదటి రౌండ్ విజేతలుగా కన్నూర్ యూనివర్సిటీ, మధురై కామరాజు యూనివర్సిటీ తమిళనాడు, జె ఎన్ టి యూ హైదరాబాద్, వెల్ టెక్ చెన్నై, వినాయక మిషన్ సాలెం జట్లు నిలిచాయని ఆదిత్య యూనివర్సిటీ వ్యాయామ ఉపాధ్యాయ విభాగాధిపతి డా.ఎన్ రవి తెలిపారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా భోజనం,వసతి రవాణా సౌకర్యాలు ఆదిత్య యాజమాన్యం సమకూర్చింది.

## డ్రగ్ అండ్ డ్రైవింగ్‌లో 17 మంది అరెస్టు

**– కోర్టుకు తరలింపు**

**గండేపల్లి, మేజర్ న్యూస్ :** మద్యం తాగి వాహనం నడుపుతున్న గండేపల్లి, జగ్గంపేట పరిధిలోని 17 మందిని అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు సీఐ వైఆర్కే శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలియజేశారు. గండేపల్లి మండల ఎస్సై శివ నాగబాబు 13 మందిని, జగ్గంపేట మండలం ఎస్సై రఘునందన్ రావు నలుగురు 17 మంది మద్యం తాగి వాహనం నడుపుతున్న వ్యక్తులను కోర్టుకు తరలించగా 11 మందికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున లక్షా పదివేల రూపాయలు జరిమానా విధించగా, ఆరుగురు వ్యక్తులకు మూడు రోజులపాటు జైలు శిక్ష విధించి సబ్ జైలుకు తరలించినట్లు వై ఆర్ కె శ్రీనివాస్ తెలిపారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో ధనుర్మాస పూజలు



పెద్దాపురం, **మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణం, మెయిన్ రోడ్‌లో వేంచేసి యున్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం నందు ధనుర్మాస పూజ మహెూత్సవములు ఈ నెల 16వ తేది నుండి జనవరి 2026, 14వ తేది వరకు ధనుర్మాస పూజలు నిర్వహించబడునని దేవస్థాన ఛైర్మన్ జల్లూరి వీర్రాజు, కార్యనిర్వాహణాధికారి కె.జగదీశ్వరరావులు తెలిపారు. ఈ సందర్భంగా వారు తెలుపుతూ ప్రతీరోజు ఈ ధనుర్మాస పూజా కార్యక్రమంలో ప్రతీరోజు కొత్తపల్లి నరసింహమూర్తి వారిచే తిరుప్పావై, విష్ణు సహస్రనామాలు, గోవిందనామాలు, శ్రీస్వామి వార్కి విశేష అభిషేక పూజలు నిర్వహించబడునని వారు తెలిపారు. కావున భక్తులు పాల్గొని, స్వామి వారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# పల్లె ప్రగతికి కూటమి బాటలు

**– మంత్రి కందుల దుర్గేష్**
**– నిడదవోలు నియోజకవర్గంలో 21 రహదారి మరమ్మతులు, నిర్మాణ పనులకుగానూ రూ.28.89 కోట్ల పరిపాలన అనుమతులు జారీ**
**– ఇచ్చిన అన్ని ప్రతిపాదనలకు అంగీకరించినందుకు సీఎం, డిప్యూటీ సీఎంలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపిన మంత్రి దుర్గేష్**

**నిడదవోలు, మేజర్ న్యూస్ :** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా ఏపీ రూరల్ రోడ్స్ స్ట్రెంతింగ్ ప్రాజెక్టు (ఏపీఆర్ఎస్పీ) తొలి దశ క్రింద నిడదవోలు నియోజకవర్గంలో 21 రహదారి మరమ్మతులు, నిర్మాణ పనులకు గానూ రూ.28.89 కోట్ల ప్రత్యేక పీఆర్ఆర్ (ప్లాన్) నిధులను కేటాయిస్తూ వెంటనే పనులు ప్రారంభం అయ్యేలా కూటమి ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేయడంపై మంత్రి కందుల దుర్గేష్ ఆనందం వ్యక్తం చేశారు. అందులో భాగంగా ఉండ్రాజవరం మండలంలో 9 పనులకు రూ.15.56 కోట్లు, పెరవలి మండలంలో 5 పనులకు గానూ 8.71 కోట్లు, నిడదవోలు మండలంలో 7 పనులకు గానూ రూ.4.62 కోట్లు కేటాయించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో రూ.72.39 కోట్లతో 125 కి.మీల గ్రామీణ రహదారులకు మహర్దశ రానుందని అన్నారు. మెరుగైన నాణ్యతతో రోడ్లు నిర్మించడం, మరమ్మతులు చేయడం తద్వారా రవాణా సౌకర్యాలను మెరుగుపర్చే ఉద్దేశంతో అభివృద్ధికి పర్యాయపదంగా కూటమి ప్రభుత్వం నిలిచిందన్నారు. ప్రభుత్వ నిర్ణయంతో ఏపీ గ్రామీణ ప్రాంతాల రోడ్లు పట్టణ రోడ్లకు ధీటుగా నిర్మాణం జరుపుకోనున్నాయని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ వెల్లడించారు. గడిచిన ఐదేళ్లలో నిడదవోలు నియోజకవర్గంలోని గ్రామీణ రహదారులు పూర్తిగా అధ్వాన్నస్థితికి చేరుకొని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆ పరిస్థితిని గమనించి ఆయా రోడ్ల అభివృద్ధికి మోక్షం కలిగించాలని మంత్రి కందుల దుర్గేష్ తొలి నుండి కృతనిశ్చయంతో ఉన్నారు. తట్టెడు మట్టి కూడా వేయని గత ప్రభుత్వం నిర్లక్ష్యంతో అడుగుకొక గుంత ఏర్పడి ప్రజలు ఎదుర్కొన్న కష్టాలు వర్ణనాతీతం అన్నారు. ఈ క్రమంలో రోజూవారీ ప్రయాణాలతో పాటు పంట



ఉత్పత్తులు తరలించేందుకు రైతులు, ప్రజలు, వాహనదారులు పడ్డ ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దుస్థితిని మార్చాలని నిర్ణయించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి సంబంధిత అంశాన్ని మంత్రి దుర్గేష్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల వినతి మేరకు నిడదవోలు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో దెబ్బతిన్న రహదారులు నిర్మించి ప్రజలకు సురక్షితమైన ప్రయాణానికి బాటలు వేయాలని కోరుతూ పదుల సంఖ్యలో ప్రభుత్వానికి ఇచ్చిన అన్ని ప్రతిపాదనలకు సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లు అంగీకరించి రోడ్లను మంజూరు చేయడంపై మంత్రి దుర్గేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇప్పటికే గుంతల రహిత ఆంధ్రప్రదేశ్ క్రింద కొన్ని రహదారులు మరమ్మతులకు నోచుకున్నాయని, ప్రస్తుతం అధునాతన పరిజ్ఞానంతో నిర్మించే రోడ్లతో రహదారి వ్యవస్థ మరింత పటిష్టంగా కానుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నిడదవోలు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట మాట ప్రకారం అందమైన రహదారులు నిర్మిస్తానని చెప్పిన మంత్రి కందుల దుర్గేష్ ఆ దిశగా ముందుకు సాగుతుండటంపై ప్రజల్లో సంతృప్తి నెలకొంది. త్వరలోనే సరికొత్త రహదారులతో నియోజకవర్గం అభివృద్ధి పథంలో సాగడమే గాక పల్లెల్లో ప్రగతి వికసిస్తుందని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# మరిడమ్మ అమ్మవార్కి పంచామృతాభిషేకం

**పెద్దాపురం,మేజర్న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు బుధవారం ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ ఆధ్వర్యంలో వేదపండితులు మరిడమ్మ అమ్మవార్కి మండపంలో జన్మ నక్షత్రం మఖ నక్షత్రం సందర్భంగా పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, చందనం, విభూదిలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించి, అనంతరం స్వర్ణ, రజతాలతో ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీ అమ్మవారి పారాయణం చేసిన మహిళా భక్తులకు, ఇతర భక్తులకు దేవస్థాన ఆధ్వర్యంలో తీర్ధ ప్రసాదాలు అందజేశారు.

ఈ కార్యక్రమంలో వేదపండితులు ఐ.వి.ప్రసాదశర్మ, ఎన్.వి.శాస్త్రి, శంకర శాస్త్రి, ఆసాదులు రాయ రామచంద్రప్రసాద్ (నాని), రాయ విజయ్ కుమార్, సిబ్బంది వెంకటరమణ, క్రాంతివీర్, గౌరి, వరహాలు, లోవ, శివ పాల్గొన్నారు.



# ఘనంగా 76వ అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం

**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఏజెన్సీ మండల కేంద్రమైన అడ్డతీగలలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రంపచోడవరం ఇంచార్జ్ డాక్టర్ కోదండ వాసవి అధ్యక్షతన నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా మండల న్యాయ సేవాధికర కమిటీ ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. అడ్వకేట్ కె ఎన్ వి రమణ మూర్తి మాట్లాడుతూ చట్టం పట్ల విద్యార్థులు మంచి అవగాహన కలిగి ఉండాలని చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టే వారిపై ఎలాంటి శిక్షలు ఉంటాయనేవి సవివరంగా వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ ఎ వి మోహన మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతటి చక్కటిదో వారి యొక్క విధులు సక్రమంగా నిర్వహించగలిగితే ఎలాంటి సమస్యను అయినా రాకుండా ఎదుర్కోవచ్చు అని ప్రతి ఒక్కరు కూడా జ్ఞానమైన విద్యని అభ్యసిస్తే ఉన్నత స్థాయికి చేరుకునే అవకాశం ఉందని ఉద్బోధించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ విద్యార్థులకు ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ రాష్ట్ర అధ్యక్షులు అయిన జాలరి వీరభద్రరావు, బాదా మోహన్, తమదాల కృష్ణారెడ్డి, అభినందన్ మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు ఎలాంటి సమస్యలున్నా వారిని



సంప్రదిస్తే వారికి న్యాయం చేసే దిశగా అండగా నిలబడతామని చెప్పారు. కళాశాల ఉపాధ్యాయ సిబ్బంది విద్యార్థులకు మానవ హక్కులపై విలువైన సమాచారం అందించారు అనంతరం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సంస్థ సభ్యులు కళాశాల సిబ్బంది లో కొంతమందికి సత్కారాలు చేసి, విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేసియున్నారు. ఈ కార్యక్రమంలో హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ మండల ప్రెసిడెంట్లు ఆయన గిరిబాబు, ముసలయ్య, లింగారెడ్డి, స్వామిరెడ్డి మరియు ఇతరులు పాల్గొనడం జరిగింది.

# 52 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు



**అడ్డతీగల, మేజర్ న్యూస్ :** అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు బుధవారం ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ సురక్ష పథకం లో భాగంగా డాక్టర్ బి. బేబీ ఆధ్వర్యంలో 52 మంది గర్భిణీ లకు వైద్య పరీక్షలు చేసారు.వీరిలో కొంతమందిని19 మంది గర్భిణీ స్త్రీలలో బలహీనతలను గుర్తించి గా వారికి ఐరన్ టాబ్లెట్లు మరియు కౌన్సిలింగ్ అందించారు. అలాగే అవసరం అయినా వారికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు, అల్ట్రాసౌండ్ పరీక్షలు చేసి వారు తీసుకోవలసిన జాగ్రత్త చెప్పడం జరిగింది.ప్రతి నెల జరుగుతున్నా ఈ ప్రధానమంత్రి మాతృత్వ అభియాన్ కార్యక్రమం లో భాగంగా ప్రతి గర్భిణీ స్త్రీ తమ ఆరోగ్య సమస్యలను ముందగానే గుర్తించి తగిన చికిత్స పొందేందుకు ఈ కార్యక్రమం సహాయపడుతుంది అని హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పండ సతీష్ అన్నారు. ఈ కార్యక్రమం సమగ్రంగా మరియు నాణ్యమైన, ప్రసవన%శీ%తర సంరక్షణనను అందించడానికి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో మహిళలకు ప్రతి నెల 9,10 తేదీన నిర్ణిత రోజు నాణ్యమైన ప్రసూతి సంరక్షణ సేవలను అందించడానికి ప్రవేశపెట్టింది అని డాక్టర్ బి. బేబీ అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గర్భిణీలకు డాక్టర్ గారి పర్యవేక్షణలలో పరీక్షలు చేస్తారని, ఈ కార్యక్రమంను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోడీ జూన్ 9, 2016న ప్రారంభించారు అని కౌన్సిలర్ నారే వాసు అన్నారు. అలాగే వీటి యొక్క ప్రాముఖ్యత, రక్తహీనత కు గురి కాకుండా తగు జాగర్తలు,గర్భిణీ స్త్రీల ఆరోగ్యం, వారు తీసుకొనవలసిన, ఆహార నియమాలు, న్యూట్రిషన్,పౌష్టికమైన ఆహారం,గురించి, గర్భిణీ స్త్రీలు రక్తం తక్కువ ఉన్నవారిని, అడిగి ఏ ఏ ఆహారం తీసుకుంటే రక్తం తల్లికి బిడ్డకు పెరుగుతుంది,అని హాస్పిటల్ కౌన్సిలర్ నారే వాసు వివరించారు.ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## 18న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో గోపూజ, శ్రీలక్ష్మీ గణపతి హెూమం



**పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానం నందు ఈనెల 18వ తేది ఉదయం 8 గంటలకు గోపూజ మరియు శ్రీ లక్ష్మీ గణపతి హెూమం ఆలయ అర్చకులచే నిర్వహించబడునని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె తెలుపుతూ ఆశక్తి గలవారు దేవస్థానంకు రూ.500/- రుసుము చెల్లించిన యెడల సదరు హెూమం సమయం నందు వారి గోత్ర నామాలు చదవబడునని, అలాగే శ్రీ మరిడమ్మ అమ్మవారిని కొత్త ధాన్యంతో మరియు విఘ్నేశ్వరునికి ప్రతీకరమైన పత్రితో విశేషంగా అలంకరించబడునని, అసిస్టెంట్ కమీషనర్ తెలిపారు. అలాగే హెూమంలో పాల్గొనే భక్తులకు శ్రీ మరిడమ్మ అమ్మవార్కి అలంకరించిన పవిత్రలు, గాజులు, పసుపు, కుంకుమ, ఫోటో, ప్రసాదం ఇవ్వబడునని హెూమం నందు పాల్గొను భక్తులు సాంప్రదాయ దుస్తులు మాత్రమే ధరించి హాజరు కావాలని ఆలయ అసిస్టెంట్ కమీషనర్ కె.విజయలక్ష్మీ తెలిపారు.

## ఆర్.బి.పట్నం గ్రామంలో వినాయకుని గుడిలో చోరీ

**– సంఘటన స్థలం పరిశీలించిన సిఐ, ఎస్సైలు**



**పెద్దాపురం రూరల్, మేజర్న్యూస్ :** పెద్దా పురం మండలం, ఆర్.బి.పట్నం గ్రామంలో చెరువు గట్టుపైన వెలసియున్న స్వయంభూ వినాయకుని గుడిలో అభరణాలు చోరీ అయినట్లు ఎస్సై వి.మౌనిక తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఉదయం ఘటన స్థలానికి సిఐ కృష్ణభగవాన్, ఎస్సై వి.మౌనికలు క్లూస్ టీమ్‌తో వెళ్ళి గుడి, గుడి పరిసర ప్రాంతాలను పరిశీలించి కేసు నమోదు చేసినట్లు ఎస్సై మౌనిక తెలిపారు. సుమారు ఆరున్నర కెజిల వెండి చోరీకి గురి అయినట్లు ఫిర్యాదులో దేవస్థాన ఛైర్మన్ గుణ్ణం వీరభద్రరావు తెలిపారని పోలీసులు పేర్కొన్నారు.

# సరికొత్త ఆవిష్కరణలకు పర్యాటక శాఖ నాంది

- వినూత్న ఆలోచనలు, 16 నెలల కాలంలో దాదాపు 30,000 పర్యాటక పెట్టుబడులతో ప్రగతికి చిరునామాగా నిలిచిన పర్యాటక శాఖ



**నిడదవోలు, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వంలో ఏపీ పర్యాటక రంగానికి సరికొత్త జవసత్వాలు వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా కల్పించడం, నూతన పర్యాటక పాలసీ 2024-29 విడుదల చేయడం దానికి అనుబంధంగా అడ్వెంచర్ స్పోర్ట్స్ గైడ్ లైన్స్, హోమ్ స్టే మరియు బ్రెడ్, బ్రేక్ ఫాస్ట్, ఉపాధి, క్యారవాన్, ల్యాండ్ అలాట్ మెంట్ తదితర పాలసీ-2025లతో వినూత్న ఆవిష్కరణలకు నాంది పలికిన పర్యాటక శాఖ అనతి కాలంలోనే అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేసింది. పీపీపీ విధానంలో ముందుకు వెళ్తోన్న పర్యాటక శాఖ వందలాది మంది ఇన్వెస్టర్లను ఆకర్షించి వారి నమ్మకాన్ని పొందింది. పాలసీ ఆపరేషనల్ గైడ్ లైన్స్‌తో ఎప్పటికప్పుడు పర్యాటక పెట్టుబడిదారులకు దిశానిర్దేశం చేస్తోంది. త్వరితగతిన ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేస్తోంది. అదే విధంగా ఐదేళ్ల కాలంలో 25,000 పర్యాటక పెట్టుబడులు లక్ష్యంగా నిర్దేశించుకున్న పర్యాటక శాఖ కేవలం ఏడాదిన్నర కాలంలోనే 30,000 కు పైగా ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించింది. రాష్ట్రంలో 50,000 గదుల ఏర్పాటు, 10,000 హోమ్ స్టే లు, 20 శాతం జీవీఏ సాధన, 15 శాతం ఉద్యోగాల కల్పన, పర్యాటకులు చేసే ఖర్చు 1700 నుండి 25000 కు పెంచేలా, పర్యాటక ప్రాంతాల్లో ఎక్కువ రోజులు గడిపేలా అవసరమైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పని చేస్తున్న పర్యాటక శాఖ టీమ్ అన్ని వర్గాలకు అందుబాటులో ఉండేలా 4500 నుండి 20 వేలకు పైగా క్లాసిఫైడ్ రూమ్స్ ఏర్పాటుకు చర్యలు ప్రారంభించింది. ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం, క్లాసిఫైడ్ రూమ్స్ ఏర్పాటు, తలసరి ఆదాయానికి పర్యాటక శాఖ నుండి ఆర్థిక సహకారం అందించడం, ఉపాధి కల్పన, సమాజ భాగస్వామ్యంతో సుస్థిర, బాధ్యతాయుతమైన పర్యాటకం దిశగా పర్యాటక శాఖ అడుగులు వేస్తోంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న పర్యాటక ప్రాంతాలకు సరికొత్త రూపుతెస్తూ అవకాశాలను అందిపుచ్చుకొని స్థానిక భాగస్వామ్యాలను బలోపేతం చేస్తూ వేలాది మంది యువతకి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధికి మార్గం చూపిస్తోంది. త్వరలోనే కాంక్రీట్, చారిత్రక కట్టడాలు, మైస్, బీచ్ శాక్ , ఫిల్మ్ టూరిజం పాలసీతో పర్యాటక శాఖలో మరింత నూతనోత్తేజం సంతరించుకోనుంది. ఇప్పటివరకు 27 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు లభించగా వీటిలో 3 ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పురోగతిలో 12, శంకుస్థాపనకు సిద్ధంగా 5, 7 ప్రాజెక్టులకు భూ కేటాయింపులు పూర్తి అయ్యాయి. ఈ నిర్మాణాలన్నీ పూర్తయితే పర్యాటకులకు 4597 రూమ్స్ అందుబాటులోకి రానున్నాయి. 2025-26లో దేశవ్యాప్తంగా 11,272 రూమ్స్ ఏర్పాటైతే మూడింట ఒక వంతు హోటళ్లు ఏపీలోనే ఏర్పాటు కావడం కూటమి ప్రభుత్వంపై నమ్మకానికి నిదర్శనం. రాష్ట్ర విభజన తర్వాత కూటమి ప్రభుత్వ హయాంలో 8 పర్యాటక గమ్యస్థానాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్రం నుండి అత్యధికంగా రూ.428 కోట్ల నిధులను పర్యాటక శాఖ రాబట్టి సీఎం చంద్రబాబునాయుడు విశ్వాసాన్ని గెలిచింది. అందులో అఖండ గోదావరి, గండికోట, సూర్యలంక బీచ్, అహోబిలం, నాగార్జున సాగర్, అరకు, అన్నవరం, సింహాచలం తదితర ప్రాంతాల్లో చేపట్టిన పర్యాటక ప్రాజెక్టుల పనులు శరవేగంగా పనులు జరుగుతున్నాయి. మిషన్ -2029కి అనుగుణంగా ఆర్థిక వృద్ధి, ఉపాధి, సాంస్కృతిక మార్పిడికి కీలకమైన పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేస్తున్న పర్యాటక శాఖ మంత్రి మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో పర్యాటక శాఖ చైర్మన్ నూకసాని బాలాజీ, స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాటలు నిత్యం అంతర్జాతీయ, జాతీయ, క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పనుల తీరుని పర్యవేక్షిస్తూ తదనుగుణంగా అధికారులకు మార్గదర్శకత్వం అందిస్తూ పర్యాటక శాఖ పురోగతికి ఇంధనంగా, పర్యాటక శాఖ ప్రగతికి చిరునామాగా నిలిచారు. త్వరలోనే పర్యాటక రంగం సరికొత్త పుంతలు తొక్కి ఏపీ ప్రపంచ పర్యాటక గమ్యస్థానాల్లో అగ్రగామిగా నిలుస్తుందనడంలో అతిశయోక్తి లేదు..



# వెంకన్న అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి బుధవారం హైదరాబాద్, బోరంపేటకు చెందిన కిలారు సోమశేఖర్, దివ్య తేజ దంపతులు, కుటుంబ సభ్యులు రూ.1,11,111 లు విరాళంగా సమర్పించారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి శేష వస్త్రములతో సత్కరించారు. దాతలకు చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, అర్చకులు, సిబ్బంది స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

# అప్పుల మయంగా ఆంధ్రప్రదేశ్

- బాబు గారి అంకెల గారడీతో బురిడి
- కాగ్ లెక్కలను తప్పుదోవ పట్టిస్తున్న వైనం
- ప్రభుత్వ భూములను పప్పు బెల్లంలా పంచుతున్న సర్కార్
- వైకాపా మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక



**కాకినాడ, మేజర్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అప్పుల మయంగా మారుస్తున్నారని మండిపడ్డారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి.. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ఆర్థిక విధానాలపై ధ్వజమెత్తారు. పక్క రాష్ట్రంలో ప్రైవేట్ సంస్థలకు భూములను వందల కోట్లకు విక్రయిస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం పప్పు బెల్లం పంచినట్టు రూపాయికి వందకు ధారాదత్తం చేయడమేంటని ప్రశ్నించారు. దీని వెనుక అధికార పార్టీకి లబ్ధి ఉందనే అనుమానం వ్యక్తం చేసారు. రాష్ట్రంలో ఆర్థిక పురోగతి అంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తున్నా కాగ్ లెక్కలు మాత్రం తిరోగమనాన్ని సూచించడం విచారకరమన్నారు. ఇటీవల విడుదల చేసిన కాగ్ నివేదికల ప్రకారం రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉత్పన్నం అవుతోందన్నారు. 2019 - 2024 మధ్య వైసిపి ఐదేళ్ల ప్రభుత్వంలో రూ.3.31 లక్షల కోట్లుమ అప్పులు చేస్తే, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన 18 నెలల కాలంలోనే రూ. 2.66 లక్షల కోట్లు అప్పులు చేసారని తెలిపారు. ప్రభుత్వం అధికారిక లెక్కలను పరిశీలిస్తే ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం నెలకు రూ.5వేల కోట్లు అప్పులు చేస్తే, కూటమి ప్రభుత్వం సగటున నెలకు రూ.15 వేల కోట్లు అప్పు చేసిందని పేర్కొన్నారు. మరోపక్క గత వైసిపి ప్రభుత్వంతో పోల్చుకుంటే ప్రభుత్వం ఆదాయం గణనీయంగా తగ్గుముఖం పట్టిందన్నారు. 2018-19 మధ్య రూ.58 వేల కోట్లు ఉండగా 2023-24 మధ్య రూ.93 వేల కోట్ల ఆదాయం ఉందన్నారు. వాస్తవాలను పక్కదారి పట్టిస్తున్న ప్రభుత్వం అంకెల గారడీతో ప్రజలను బురిడి కొట్టించడం ఇప్పటికైనా ఆపాలన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా ముందుకు నడిపించడం అంటే ఈవిఎంలను ఛార్జింగ్ పెంచినంత సులువు కాదన్న విషయం గ్రహించాలని ఎద్దేవా చేసారు నాగమణి.

## స్పెషల్ లీవ్ పై ప్రభుత్వం వెంటనే స్పందించాలి

- యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు



**కొత్తపేట, మేజర్ న్యూస్ :** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్ ) నుండి ఇన్సర్వీస్ ఉపాధ్యాయులను మినహాయించాలని సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని కోరుతూ కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్ నుండి ఆర్డిఓ కార్యాలయం వరకు కొత్తపేట డివిజన్ స్థాయిలో ర్యాలీ నిర్వహించి ఆర్.డి.ఓ శ్రీకర్ కు మెమోరాండం అందచేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బోధనేతర కార్యక్రమాలతో ఉపాధ్యాయుల విలువైన సమయం వృధా అవుతోందని,ఆన్లైన్ పనులు ఇప్పటికే బహిష్కరించుట జరిగిందని ప్రభుత్వం వెంటనే స్పందించి స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని లేకపోతే 18 వ తేదీ కలెక్టరేట్ ల ఎదుట భారీ నిరసన ప్రదర్శన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ఎస్.జ్యోతి బసు,జిల్లా సహాధ్యక్షులు జి.వి.రమణ,కార్యదర్శులు వై.మురళి, పి.మురుగేశ్వ రరావు, వై.బాలాజి, వి.రత్నం, కె.శ్రీనివాస్, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు టి.విజయ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** రావులపాలెం మండలం ఊబలంక గ్రామంలో స్థానిక హై స్కూల్ నందు విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్ అవేర్నెస్ అవగాహన కార్యక్రమం రావులపాలెం టౌన్ ఇన్స్పెక్టర్ ఎమ్. శేఖర్ బాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ యువత మత్తుకు గంజాయికి ఆకర్షితులు కావద్దని మంచిగా చదువుకుని ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఉన్నతమైన ఉద్యోగాలు సంపాదించి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులకు తెలిపారు. పిల్లల తల్లిదండ్రులను ఉద్దేశించి మాట్లాడుతూ సెల్‌ఫోను వాడకంపై సూచనలు ఇస్తూ అనవసర లింక్‌లు ఓపెన్ చేయవద్దని ఎవరైనా డిజిటల్ అరెస్ట్ పేరున బెదిరిస్తే భయపడవద్దని, అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవద్దని, ఎవరైనా డబ్బులు పోగొట్టుకున్నట్లైతే 1930 కు 24 గంటల్లో కాల్ చేసి కంప్లైంట్ చేయాలని చెప్పారు. మైనరు పిల్లలకు నడపటానికి మోటారు వాహనాలు ఇవ్వరాదని, ఏదైనా ప్రమాదం జరిగితే మైనరు బాలల తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## క్రికెట్ అభివృద్ధికి బాటలు వేస్తాం.. త్వరలో కార్యాచరణ

- కేడీసీఏ నూతన అధ్యక్షుడికి క్రీడాకారుల ఘన సన్మానం



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో క్రికెట్ క్రీడను కొత్త పుంతలు తొక్కిస్తామని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు వెళ్తామని కాకినాడ జిల్లా క్రికెట్ అసోసియేషన్ (కేడీసీఏ) ప్రెసిడెంట్ తలాటం హరీష్ ఉద్ఘాటించారు. ఇటీవల అసోసియేషన్ అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన హరీష్‌ను కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాల మైదానంలో క్రీడాకారులు ఆత్మీయంగా బుధవారం సత్కరించారు. పి.ఆర్. కాలేజీ గ్రౌండ్‌లో నిత్యం సాధన చేసే క్రికెట్ క్రీడాకారులు, గ్రౌండ్ యూజర్స్ అసోసి యేషన్ సభ్యులు కలిసి ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో హరీష్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు. సన్మానం స్వీకరించిన అనంతరం హరీష్ మాట్లాడుతూ, కాకినాడతో పాటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా క్రికెట్ అభివృద్ధికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అభివృద్ధి ప్రణాళికలను త్వరలోనే అమల్లోకి తెస్తామన్నారు. క్రీడాకారులంతా సంఘటితంగా ఉండి జిల్లా క్రికెట్ ప్రతిష్టను పెంచాలని కోరారు.

# జెఎన్టీయుకెలో ఘనంగా ప్రారంభమైన సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్





**కాకినాడ, మేజర్ న్యూస్ :** జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో ఈనెల 10వ తేదీ నుండి 14వ తేదీ వరకు అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు) సహకారంతో జెఎన్‌టియుకె, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం మరియు రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్, కాకినాడ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విప్,విశాఖపట్నం వెస్ట్ ఎమ్మెల్యే, ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ అసోసియేషన్ అధ్యక్షులు వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షులు పి.గణ వెంకట రెడ్డి నాయుడు (గణబాబు)ప్రారంభించారు. జెఎన్‌టియుకె క్రీడా ప్రాంగణంలో బుధవారం సాయంత్రం ఉపకులపతి ప్రొఫెసర్ సి.ఎస్.ఆర్.కె ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి గణబాబు ముఖ్యఅతిథిగా విచ్చేయగా విశిష్ట అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మరియు అర్జున అవార్డు గ్రహీత, మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకటరమణ, గౌరవ అతిథులుగా జిల్లా మేజిస్ట్రేట్ & కలెక్టర్ సగిలి షాన్ మోహన్, జిల్లా అదనపు ఎస్పి పాటిల్ దేవ్‌రాజ్ మనీష్, ఏఐయు అబ్జర్వర్ డాక్టర్ ఇ. త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యఅతిథి గణబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో క్రీడాస్ఫూర్తితో ఆడి ఉత్తమ ప్రతిభ చూపాలన్నారు. ఈ టోర్నమెంట్‌కు వచ్చిన క్రీడాకారులు, కోచ్‌లు మరియు టీమ్ మేనేజర్‌లకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జెఎన్‌టియుకె ఆధ్వర్యంలో అన్ని సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. యువత క్రీడలలో రాణించడం ద్వారా జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవచ్చునన్నారు. క్రీడాకారులకు ముఖ్యంగా క్రమశిక్షణ ఎంతో అవసరమని, దీని ద్వారా అటు చదువులోను, ఇటు క్రీడలలోను రాణించగలరన్నారు.

మాజీ అంతర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడు పి.వెంకట రమణ మాట్లాడుతూ వాలీబాల్ క్రీడాకారులు కష్టపడి ఆడుతూ క్రమశిక్షణతో మెలగాలన్నారు. క్రీడలలో చివరి వరకు కష్టపడి ఆడినవారు ఎప్పటికైనా విజయం సాధిస్తారన్నారు.

జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల నుండి విచ్చేసిన వాలీబాల్ క్రీడాకారులకు అభినందనలు తెలియజేసి వాలీబాల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు.

జిల్లా అదనపు ఎస్పి పాటిల్ దేవ్‌రాజ్ మనీష్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు కూడా సమ ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ క్రీడాకారులు తమపై తాము నమ్మకం ఉంచుకుని బాగా రాణించినపుడే విజయం సాధించవచ్చునన్నారు. అలాగే దక్షిణ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులను, కోచ్‌లను, మేనేజర్‌లను, యూనివర్శిటీ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు.

జెఎన్‌టియుకె ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్‌కె.ప్రసాద్ మాట్లాడుతూ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్శిటీ వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించిన అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్శిటీస్ (ఏఐయు)కు కృతజ్ఞతలు తెలియజేస్తూ పోటీల విజయవంతానికి కృషి చేస్తున్న జిల్లా అధికారులకు, పోలీసు అధికారులకు పూర్తి సహకారం అందిస్తున్నామన్నారు. క్రీడాకారులకు, అధికారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు.

జెఎన్‌టియుకె స్టేడియం, ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల, సురంపాలెం మరియు రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ సైన్సెస్‌లో నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు 40 మ్యాచ్‌లు జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెక్టార్ ప్రొ.పి.సుబ్బారావు, రిజిస్ట్రార్ ప్రొ.ఆర్.శ్రీనివాసరావు, ఓఎస్‌డి ప్రొ.డి.కోటేశ్వరరావ, డైరెక్టర్‌లు, యుసిఇకె ప్రిన్సిపాల్, యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ మరియు టోర్నమెంట్ కన్వీనర్ డా.జి.శ్యామ్‌కుమార్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.జి.పి.రాజు, నగర ప్రముఖులు, క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్‌లు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాశాఖ అధికారిగా పడాల నాగేశ్వరరావు



**అమలాపురం,మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అం బేద్కర్ కోనసీమ జిల్లా నూతన జిల్లా విద్యాశాఖ అధికారిగా పడాల నాగేశ్వరరావు బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించి అనంతరం జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భ ంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విద్యా వ్యవస్థకు దార్శనిక నాయకత్వం వహించి దిక్సూచిగా నిలుస్తూ విద్య వ్యాప్తి ద్వారా జిల్లా యొక్క పేరు ప్రఖ్యాతులు రాష్ట్ర స్థాయిలో ఇనుమడింప చేసేలా అందరి సమన్వయంతో కృషి చేయాలని కోరారు. అదేవిధంగా జిల్లాలో విద్యా వ్యాప్తి ద్వారా ఎంతోమం దిని ఉత్తమ పౌరులను తీర్చిదిద్దాలని ఆ దిశగా ముందడుగు వేయాలని సూచించారు.

## ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వం

**- వాడపల్లి ట్రస్ట్ బోర్డు సభ్యుల అమ్మకం చేసిన బండారు**
**- మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ధ్వజం**



**రావులపాలెం, మేజర్ న్యూస్ :** సామాన్యుడికి వైద్యాన్ని అందుబాటులో లేకుండా చేస్తున్న కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ధ్వజమెత్తారు. బుధవారం రావులపాలెంలోని మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో నియోజకవర్గంలోని సేకరించిన 57 వేల సంతకాల ప్రతులను జిల్లా హెడ్ క్వార్టర్ అయినటువంటి అమలాపురం తరలించేం దుకు నాలుగు మండలాల నుండి ప్రతులను తీసుకుని వచ్చిన ప్రతినిధు లతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మీరు మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వం అవినీతి ఆరోపణలతో కూరుకుపో యిందని పేద ప్రజలతో పాటు మధ్యతరగతి దిగువ తరగతిలో ఉన్న ప్రజలకు ఏదీ దరి చేరడం లేదని మోసపూరితమైన హామీలతో కూటమిగా ఏర్పడి ప్రభుత్వ వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి దొరికిన కాడికి దోచుకుంటున్నారని ఆయన వాపోయారు. అలాగే కోనసీమ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన ఆలయ ట్రస్ట్ బోర్డ్ నియామక ఉత్తర్వులు వెలువడిన దానిపై ఆయన తీవ్రంగా ఆక్షేపించారు. ఇక్కడ ఎమ్మెల్యే బండారు సత్యానందం ట్రస్ట్ మెంబర్లను అమ్మకం పెట్టారని, కలెక్షన్లు ఏజెంట్లు పెట్టుకుని గుడి టికెట్లను అమ్మేసి సొమ్ము వసూలు చేసి ఎమ్మెల్యే ఇంటికి చేరవేస్తు న్నారని టిడిపి హయంలోని ధర్మకర్తల మండలి సభ్యుడు హుండీలో చేయి పెట్టి డబ్బులు తీసేసిన ఘటనతోపాటు మొన్న కూడా వీరి హయంలోనే లెక్క పెట్టేవారు కూడా దోచేసా రని, లెక్క పెట్టేవారు సైతం వీరే ఏర్పాటు చేస్తున్నారని వారి ద్వారా దోపిడీ జరిగిస్తున్నారని ఇదంతా ఎమ్మెల్యే కొనసానలోనే జరుగుతుందని తీవ్ర ఆరోపణలు చేశారు. ఇటీవల ఆలయ అధికారిపై వచ్చిన ఆరోపణపై గుడి పరువును దృష్టిలో పెట్టుకొని నొక్కి వక్కాణిం చారు. ప్రజలకి ఏం సంకేతం ఇస్తున్నారని, గుడిని భ్రష్టు పట్టించారని తమ హయాంలో అభివృద్ధి చేసి విస్తృతమైన వసతులు అన్ని కల్పిస్తే నేడు హుండీ దొంగతనం ట్రస్ట్ సభ్యుల అమ్మకం, అధికారుల అసాంఘిక కార్యకలాపాలతో గుడి మార్మోగుతుందని, అలాగే ఇక్కడ విగ్రహంను నెలకొల్పిన పినపోతూ గజేంద్రలో కు చెందిన అగ్నికుల క్షత్రియులకు ట్రస్టీలో ఒక్క మెంబర్ కూడా ఇవ్వలేకపోవడం సిగ్గుచేటని తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి డేవిడ్ రాజు, కర్రీ నాగిరెడ్డి, జడ్పిటిసిలు కుడుపూడి శ్రీనివాస్, బోనం సాయిబాబు, తోరాటీ లక్ష్మణ రావు, కనుమూరి శ్రీనివాసరాజు, స్వీట్ కొట్టు సత్తిబాబు, తమ్మన శ్రీని వాస్, సాకా ప్రసన్నకుమార్, గుణ్ణం రాంబాబు, గోవిందరెడ్డి, కృష్ణారెడ్డి, పమ్మి చంటి, వై.వి.ఏనుగుపల్లి నాగార్జున, గంధం అన్నవరం, జనపరెడ్డి కృష్ణంరాజు, కొవ్వూరి సుధాకర్ రెడ్డి, గన్నవరపు శ్రీనివాస్, పెదపూడి శ్రీనివాస్, కోణాల రాజ్ కుమార్, పెనుమాత్సా కృష్ణంరాజు, పూల గుర్తు రామారావు, సీత, సబ్బితి మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కనుగోలు ప్రక్రియ పారదర్శకంగా ఉండేలా కృషి చేయాలి

**- అధికారులకు జెసి అపూర్వ భరత్ ఆదేశం**



**కాకినాడ, మేజర్ న్యూస్ :** జిల్లాలో జరుగుతున్న ధాన్యం కనుగోలు ప్రక్రియ నూరు శాతం పారదర్శకంగా, సజావుగా సాగేందుకు సంబంధిత అధికారులు కృషి చేయాలని కాకినాడ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ అధికారులను ఆదేశించారు.

బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జేసీ అపూర్వ భరత్.. రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులతో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియపై సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ అపూర్వ భరత్ మాట్లాడుతూ.. జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రక్రియకు సంబంధించి ఇప్పటివరకు 1.64 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులనుంచి కనుగోలు చేశామన్నారు. రైతులందరు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న కనీస మద్దతు ధరకే తమ పంటను అమ్ముకునేలా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులు నుంచి సేకరిస్తున్న ధాన్యానికి నిర్ణిత సమయంలో రైతులకు సొమ్ము పొందేలా ఎఫ్టీవో (ఫండ్ ట్రాన్స్ఫర్ ఆడర్) లను సకాలంలో జనరేట్ చేయాలని ఆదేశించారు. రైసుమిల్లుల వద్ద రద్దీ లేకుండా ట్రక్కులను ఎప్పటి కప్పుడు ఖాళీ చేయించాలని జేసీ తెలిపారు. క్షేత్రస్థాయిలోని రెవెన్యూ, వ్యవసాయ, పౌరసరఫరాల శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేసి జిల్లాలో ధాన్యం కనుగోలు ప్రక్రియ నూరు శాతం సజావుగా సాగేందుకు అధికారులు కృషి చేయాలని జేసీ అపూర్వ భరత్ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.విజయ్ కుమార్, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులా నాయక్, డీఎస్వో సత్యనారాయణ రాజు, వ్యవసాయ శాఖ ఎడీఏలు, అన్ని మండలాల ఏవోలు, సీఎస్డీటీలు తదితరులు పాల్గొన్నారు.

## రూ.6.17 కోట్ల వ్యయంతో తారురోడ్డు మంజూరు

**- గౌరిదేవిపేట టూ మాధవరావుపేట వరకు**
**- రంప ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి చొరవతో**
**- హర్షం వ్యక్తం చేస్తున్న వైస్ ఎంపీపీ దొంతు**
**- టిడిపి మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య**




**ఎటపాక, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం ద్వారా మండల పరిధిలోని గౌరీదేవిపేట గ్రామం బస్ స్టాప్ నుండి నల్లకుంట, పూసుగూడెం మీదుగా మాధవరావుపేట నుండి చింతూరు వెళ్ళే ప్రధాన జాతీయ రహదారి కలిసే వరకు 10 కిమీ మేర పంచాయతీరాజ్ శాఖ ద్వారా నూతన తారురోడ్డు నిర్మాణానికి 6.17 కోట్ల నిధులు మంజూరు కావడంతో ఎటపాక వైస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, టిడిపి మండల అధ్యక్షులు బొల్లా పుల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి ద్వారా పలుమార్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి మాధవరావుపేట రహదారి సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు.

ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం ద్వారా నూతన తారురోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి భాస్కర్, పంచాయతీరాజ్ శాఖ, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, టిడిపి యువ నాయకులు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేసిన వారిలో గౌరీదేవిపేట సర్పంచ్ ఉలవల శివకనకరాజు, ఉపసర్పంచ్ మడకం నరసింహారావు, గౌరీదేవిపేట గ్రామ కమిటీ అధ్యక్షులు అమరవరపు చిన్నరాము, ముక్కెర భద్రరావు, మల్లెల లక్ష్మణరావు, చుంద్రు రాజా, కాటిబోయిన నాగేశ్వరరావు, పాఠశాల చైర్మన్ గుండె సుధాకర్, గడ్డం నాగరాజు, నల్లకుంట కృష్ణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు కొమరం నాగేశ్వరరావు, పెనుబల్లి బాలకృష్ణ, గౌరిదేవిపేట, నల్లకుంట, విస్సాపురం గ్రామస్తులు ఉన్నారు.

# విద్య ద్వారానే సమాజంలో గౌరవం..సముచిత స్థానం



- ఎమ్మెల్యే అయితాబత్తుల
- ఘనంగా చిక్కం సత్తిరాజు మెమోరియల్ జూనియర్ కళాశాల రజతోత్సవం
- లాభాపేక్షలేని నాణ్యమైన విద్యే లక్ష్యం
- ఛైర్మన్ డాక్టర్ ఉమామహేశ్వరరావు
- ఆకట్టుకున్న విద్యార్థుల సంస్కృతిక ప్రదర్శనలు

**అమలాపురం, మేజర్ న్యూస్ :** ఉన్నత విద్య ద్వారానే సమాజంలో సముచిత స్థానం, అరుదైన గౌరవం లభిస్తుందని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. విద్య ద్వారా లభించిన గౌరవం, హోదా ఎప్పటికీ నిలిచి ఉంటుందన్నారు. ఉప్పలగుప్తం మండలం గొల్లవిల్లిలోని శ్రీ చిక్కం సత్తిరాజు మెమోరియల్ జూనియర్ కళాశాల 25 వసంతాల రజతోత్సవ వేడుక బుధవారం ఘనంగా నిర్వహించారు. చిక్కం సత్తిరాజు జూనియర్ కాలేజ్ అండ్ అన్నదాన సత్రం, ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ చిక్కం ఉమామహేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆనందరావు తోపాటు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ సోంబాబు, జనసేన నాయకుడు చిక్కం భీముడు తదితర నాయకులు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ గొల్లవిల్లి లాంటి గ్రామీణ ప్రాంతంలో 25 ఏళ్ల క్రితం చిక్కం, మోటూరి కుటుంబ సభ్యులతో పాటు ఎన్. కొత్తపల్లి కు చెందిన మునసబు రాజు, పొత్తూరు వెంకటపతి రాజు, నడింపల్లి సూర్య నారాయణ రాజు కుటంబాల దాతృత్వంలో విద్యాసంస్థను నెలకొల్పి నేటికీ పేద వర్గాల పిలల అభ్యున్నతి కోసం కృషిచేయడం అభినందనీయం అన్నారు. ఈ సంస్థ నానాటికీ అభివృద్ధి చెంది ఇప్పుడు డిగ్రీ కళాశాలకు కూడా వచ్చిందని, త్వరలోనే ఈ సంస్థ ద్వారా అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటుకు తనవంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. మెట్ల రమణబాబు మట్లాడుతూ గ్రామీణ స్థాయిలో ఉన్న ఇటువంటి విద్యాసంస్థలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, ఇంకా ఇక్కడ అగ్రికల్చర్ కోర్సులు వచ్చేందుకు తమ వంతు కృషిచేస్తానన్నారు. కళాశాల ఛైర్మన్ డాక్టర్ చిక్కం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ విద్యాసంస్థను తమ పూర్వీకులు స్థాపించారని తెలిపారు. అప్పటి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ సతీష్ చంద్రతోపాటు పలువురు అధికారులు కళాశాలకు ఎంతో సహకరించారన్నారు. నేటికీ స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తి స్థాయి సహాయ సహకారాలను అందిస్తున్న క్రమంలోనే నేటికీ కళాశాల ద్వారా దిగ్విజయంగా విద్యనందిస్తున్నామన్నారు. అనంతరం కళాశాలలో చదివి మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సహాకాలను, జ్ఞాపికలను ఎమ్మెల్యే ఆనందరావు తదితర నాయకుల చేతులమీదుగా అందించారు. కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ అధికారి వెంకటజయలక్ష్మి, జనసేన నాయకులు నాగ మానస, చిక్కాల సతీష్, కరస్పాండెంట్, సెక్రటరీ చిక్కం రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు తాళ్ల రవి, చిక్కం బాలసుబ్రహ్మణ్యం, జనసేన నాయకులు నాగుళ్లపల్లి రాజు, చిక్కం ఉమామహేశ్వరరావు, యాళ్ల సతీష్, చిక్కం వెంకటకృష్ణ, సలాది నాగరాజు, కోడి శివ, గనిశెట్టి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# కాకినాడ జిల్లాలో రోడ్డు భద్రతకు ప్రాధాన్యత

- 'డ్రంక్ అండ్ డ్రైవ్' కేసులపై కఠిన చర్యలు

**కాకినాడ, మేజర్ న్యూస్ :** రోడ్డు ప్రమాదాలను నివారించాలనే పటిష్ట సంకల్పంతో, కాకినాడ జిల్లా పోలీసులు 'డ్రంక్ అండ్ డ్రైవ్' కేసులపై కఠిన వైఖరిని ప్రదర్శించారు. జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ ఆదేశాల మేరకు బుధవారం కాకినాడ పట్టణంలోని ట్రాఫిక్ 1, ట్రాఫిక్ 2 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న 22 మంది వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ 22 కేసులనూ స్పెషల్ మొబైల్ జేఎఫ్‌సీ మేజిస్ట్రేట్ కోర్టు, కాకినాడ, ఎన్.ఉషా లక్ష్మి కుమారి ముందు హాజరుపరచగా, 22 మందికీ జైలు శిక్ష ఖరారైంది. ఒక కేసులో 6 రోజులు జైలు శిక్ష; 3



కేసులలో 4 రోజుల చొప్పున జైలు శిక్ష; 11 కేసులలో 3 రోజుల చొప్పున జైలు శిక్ష; 7 కేసులలో 2 రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. రోడ్డు భద్రత విషయంలో జిల్లా యంత్రాంగం ఎంత కఠినంగా వ్యవహరిస్తోందో ఈ తీర్పు స్పష్టం చేస్తోంది. ప్రజల ప్రాణాలను కాపాడడం, రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించడమే ఈ కఠిన చర్యల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశమని, మద్యం సేవించి వాహనం నడిపే వారికి కోర్టు విధించిన ఈ జైలు శిక్షలు ఒక బలమైన హెచ్చరికగా నిలవాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి, రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ విజ్ఞప్తి చేసారు.

# కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ అయిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

- ఫ్రూట్ జెల్లీ పై జీఎస్టీ తగ్గించినందున మంత్రికి కృతజ్ఞతలు తెలిపిన ఎంపీ ఉదయ్ శ్రీనివాస్

**కాకినాడ, మేజర్ న్యూస్ :** కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ బుధవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మామిడి తాండ్రపై కేంద్రం ఇటీవల జీఎస్టీని భారీగా తగ్గించడంతో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఏపీలో ముఖ్యంగా కాకినాడ జిల్లా, గొల్లప్రోలు మండలం చేబ్రోలులో మామిడి తాండ్ర పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు, రూ.400 కోట్లు టర్నోవర్ కలిగిన ఈ పరిశ్రమ ద్వారా సుమారు 15 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారని, ముఖ్యంగా గ్రామీణ మహిళలు అధిక సంఖ్యలో ఉపాధి పొందుతున్నారని తెలిపారు. గత ఎన్నికల సమయంలో మామిడి తాండ్రపై జిఎస్టి తగ్గించేందుకు కృషి చేయాలని పవన్ కళ్యాణ్‌కు పరిశ్రమ యజమానులు విన్నవించుకోవడం జరిగిందన్నారు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సూచనలు మేరకు మామిడి తాండ్ర పరిశ్రమలను ప్రత్యేకంగా సందర్శించడంతో పాటు ఈ ఏడాది ఫిబ్రవరి, ఆగస్టు నెలల్లో ఆర్థికశాఖ మంత్రి నిర్మల సీతారామన్‌కు లేఖలు రాసి జీఎస్టీని తగ్గించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కేంద్రం మామిడి తాండ్రపై జిఎస్టి ని 12 శాతం నుండి 5 శాతానికి తగ్గించిందన్నారు. జిఎస్టి తగ్గింపు ద్వారా చిన్న,మధ్య తరహా మామిడి తాండ్ర పరిశ్రమలకు ఊరట లభించడంతోపాటు,



ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహకంగా ఉంటుందని, తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. తన విజ్ఞప్తి మేరకు జీఎస్టీ పై సానుకూల నిర్ణయం తీసుకున్న మంత్రి నిర్మలా సీతారామన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.

# రైతు సమస్యలు తీర్చాలని సిపిఐ ధర్నా




**పిఠాపురం, మేజర్ న్యూస్ :** యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదని, నాయకులు ఫోటోలకు ఫోజులు మాని రైతుల సమస్యలు తీర్చాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి తాటిపాక మధు డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై బుధవారం సాయంత్రం పిఠాపురం స్థానిక వ్యవసాయ శాఖ ఏడి కార్యాలయం వద్ద సిపిఐ రైతు సంఘం సంయుక్తంగా నిరసన కార్యక్రమం (ధర్నా) నిర్వహించారు. రైతు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని పిఠాపురం ఏడిఏ పి. స్వాతికి అందజేశారు. ఈ సందర్భంగా తాటిపాక మధు మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యుత్ బిల్లులు రద్దు చేయాలని, నిబంధనలు సడలించి రైతు ఉత్పత్తులు... ముఖ్యంగా ధాన్యం, పత్తి, మొక్కజొన్న పంటలకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వం బోనస్ కలిపి కొనుగోలు చేసేందుకు వెంటనే చర్యలు చేపట్టాలని, మార్కెట్ ధరలు పడిపోయిన అరటి, బత్తాయి, నిమ్మ రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, కౌలు రైతులకు అన్నదాత సుఖీ భవ పథకం అమలు చేయాలని, బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని, తుఫాన్ లు, అధిక వర్షాలు, వరదలు వలన పంట నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ వెంటనే చెల్లించాలన్నారు. పంటలన్నిటికీ ఉచిత పంటల బీమా పథకం అమలు చేయాలని, కౌలు రైతులను ఆదుకోవాలని, ఆత్మహత్యలు చేసుకున్న ప్రతి రైతు కౌలు రైతు కుటుంబాలకు రూ. 10 లక్షలు వరకూ ఎక్స్ గ్రేసీయా చెల్లించాలని, రైతు దిగుమతులపై గతంలో ఉన్న సుంకాలను పునరుద్ధరించాలని, దేశం నుండి ఎగుమతి చేసే వ్యవసాయ ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె బోడకొండ, సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, నియోజక వర్గ కార్యదర్శి సాకా రామకృష్ణ, ఏపీ రైతు సంఘం జిల్లా కన్వీనర్ నక్క శ్రీనువాస్ రావు, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవాని, ఏ ఐ వై ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై బాబీ తదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్ర శబరిమలై భవిష్యత్తులో విశ్వవ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుంది

- పీఠాధిపతి ప్రజ్ఞానంద బాలసరస్వతి స్వామీజీ



**శంఖవరం, మేజర్ న్యూస్ :** 18 కొండల మధ్య ఆహ్లాదకరమైన వాతావరణంలో పచ్చని చెట్లు మధ్యలో అయ్యప్ప స్వామివారి దివ్య క్షేత్రం నిర్మించడం మానవ సంకల్పం కాదు అని దైవ సంకల్పమని పీఠాధిపతి ప్రజ్ఞ బాల సరస్వతి స్వామీజీ తెలిపారు. మండలంలోని సిద్ధి వారిపాలెం గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఆంధ్ర శబరిమలై అయ్యప్ప స్వామివారిని దర్శించుకునేందుకు బుధవారం పెనుగొండ వాసవి కన్యకా పరమేశ్వరి దేవీ పుణ్యక్షేత్రం నుండి పీఠాధిపతులు ప్రజ్ఞా నంద బాల సరస్వతి స్వామీజీ రాగా ఆలయ చైర్మన్ కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దుస్సాలువాతో సత్కరించి స్వామీజీ చేతులు మీదుగా అయ్యప్ప స్వామివారికి పంచామృత అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజ్ఞానంద సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ ఆంధ్ర శబరిమలై రాబోయే రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందుతుంది అని ఇది మానవ సంకల్పం కాదని దైవ సంకల్పం అని ఆయన తెలిపారు. ఇంతటి చక్కటి వాతావరణంలో అయ్యప్ప స్వామి ఆలయం నిర్మించడం కుసుమంచి శ్రీనివాసరావు గురుస్వామి సంకల్పంతో పాటు దైవ సంకల్పం కూడా ఉందని, కేరళ వెళ్లలేని భక్తులకు ఆంధ్ర శబరిమలై చక్కటి వరం అని, భవిష్యత్తులో కేరళ కన్నా ఎక్కువగా ఆంధ్ర శబరిమలై ప్రసిద్ధి చెందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సేవకులు పడాల రాంబాబు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.